RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY తెలుగు దినపత్రిక

| మల్కాజిగిరి MALKAJGIRI | సంపుటి : 3 VOLUME : 3 | సంచిక : 5 ISSUE NO : 5 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ EDITOR : MERUGU CHANDRAMOHAN | ఆదివారం, జూన్, 22, 2025 Sunday, June,22,2025 | పేజీలు : 8 వెల : రూ.4/- PAGES : 8 RS : 4 /- |
|---|---|---|---|---|---|

## గాజా, ఇరాన్‌పై ఇజ్రాయిల్ దాడులు.. భారత్ మౌనం వీడాలన్న సోనియా గాంధీ



**న్యూఢిల్లీ,జూన్, 21:**గాజా, ఇరాన్‌పై ఇజ్రాయిల్ సృష్టిస్తున్న నరమేధంపట్ల భారత్ మౌనంగా వీడాలని కాంగ్రెస్ నేత సోనియా గాంధీ అన్నారు. భారత్ మౌనంగా ఉంటే తన స్వరాన్ని కోల్పోవడమే కాదు, విలువల్ని సరెండర్ చేసినట్లు అవుతుందని ఆమె పేర్కొన్నారు.గాజా,ఇరాన్‌పై ఇజ్రాయిల్ సృష్టిస్తున్న మారణహోమం పట్ల భారత్ మౌనంగా ఉండడాన్ని కాంగ్రెస్ నేతసోనియా గాంధీ తప్పుపట్టారు. భారత్ తనస్వరాన్ని కోల్పో వడమే కాదు, విలువల్ని సరెండర్ చేసినట్లు అవుతుందని ఆమె పేర్కొన్నారు. దహిందూ ఆంగ్లదినపత్రికలో సోనియా రాసిన వ్యాసాన్ని పబ్లిష్ చేశారు.ఇండియాన తన స్వరాన్ని వినిపించేందుకు ఇంకా ఆలస్యం కాలేదన్న టైటిల్‌తో ఆ ఐటమ్‌ను రాశారు.




## గువాహటి నుంచి చెన్నైకి వెళ్లే విమానానికి తప్పిన ప్రమాదం

**న్యూఢిల్లీ,జూన్,21:**ఇండిగో సంస్థకు చెందిన ఓవిమానానికి పెను ప్రమాదం తప్పింది. గువాహటి నుంచి చెన్నై వెళ్లాల్సిన ఇండిగో విమానం తృటిలో ప్రమాదం నుంచి బయటపడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గురువారం సాయంత్రం 4.40 గంటలకు ప్రయాణికులతో బయలుదేరిన ఇండిగో 6ఈ 6764 టేకాఫ్ అయింది. అయితే కొంత సమయానికే విమానంలో ఇంధనం లేనట్లు పైలట్ గురించి ఎటిసికి 'మేడే' సందేశం పంపించారు

## 'మేకిన్ ఇండియా'తో భారత్ కంటే చైనాకే..

# ఎక్కువ లాభం: రాహుల్

**న్యూఢిల్లీ,జూన్, 21:**మేకిన్ ఇండియా ప్రోగ్రాం వల్ల భారత్ కంటే ఎక్కువగా చైనానే లాభపడిందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వం ప్రధాని నరేంద్ర మోదీపై విమర్శలు గుప్పించారు. భారత్ తో తయారీ రంగం వెనకబడటంతో నిరుద్యోగం పెరిగిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఢిల్లీలోని ప్రముఖ నెహ్రూ ప్లేస్'లో రాహుల్ గాంధీ పర్యటించారు. అక్కడ టెక్నీషియన్లతో కాసేపు మాట్లాడారు. దీన్ని ఎక్స్ లో పోస్టు చేశారు. అయితే కేంద్ర ప్రభుత్వంపై రాహుల్ గాంధీ అనేక ప్రశ్నలు సంధించారు. చైనా నుంచి దిగుమతులు రెండు రెట్లు ఎందుకు పెరిగాయని ప్రశ్నించారు. 'మేకిన్ ఇండియా' లో ఫ్యాక్టరీలలో ఉత్పత్తులు అమాంతం పెరుగుతున్నాయని చెబుతున్నా నిరుద్యోగం ఎందుకు పెరుగుతోందని అడిగారు.ప్రధాని మోదీ కేవలం నినాదాలకే పరిమతం అవుతారని పరిష్కారాలు చూపరని రాహుల్ గాంధీ విమర్శించారు. 2014 నుంచి భారత్‌లో తయారీ రంగం పడిపోయిందని కేవలం 14 శాతానికే పరిమి తమైందని ఆరోపించారు. నిజం ఎప్పుడు చేదుగానే ఉంటుందన్నారు. భారత్ లో వస్తువులను అసెంబ్లింగ్ మాత్రమే చేసుకుంటు న్నామని, వాటిని తయారు చేయడం లేదని అన్నారు. అందుకే చైనా నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తుందన్నారు. ప్రొడక్ట్ తయారీ ప్రోత్సాహకాలను కేంద్ర ప్రభుత్వం మెల్లిగా వెనక్కి తీసుకుంటుందని ఆరోపించారు. తయారీ రంగంలోకచ్చితంగా సంస్కరణలు అవసరమని సూచించారు. ఇక్కడ మనం మార్కెట్ గా ఉండకూడదు. మనం కూడా తయారీ రంగంలో ఎంతో దూసుకు పోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.





## భష్టుపట్టిన రెవెన్యూ వ్యవస్థను గాడిన పెడుతున్నాం


### రెవెన్యూసదస్సుల ముగింపు సమావేశంలో మంత్రి పొంగులేటి

**హైదరాబాద్,జూన్ 20,తెలంగాణ దిశ:** తెలంగాణలో దశాబ్ద కాలంగా బీఆర్ఎస్ పాలనలో రెవెన్యూ వ్యవస్థ భ్రష్టు పట్టిందని, విధ్వంసమైన వ్యవస్థను ప్రక్షాళన చేస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. స్వరాష్ట్రంలో ఏళ్ల తరబడి ప్రజలు ఎదుర్కొన్న భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలన్న ఆశయంతో తీసుకొచ్చిన భూ భారతి చట్టాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్నామన్నారు. రెవెన్యూ వ్యవస్థలో భూ భారతికి ముందు భూ భారతి తర్వాత స్పష్టమైన మార్పు కనిపిస్తుం దన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రెవెన్యూ సదస్సులు ముగిసిన నేపథ్యంలో మంత్రి శనివారం అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నాటి ప్రభుత్వం ఎంతో గొప్పగా 2020లో తీసుకువచ్చిన ఆర్వోఆర్ చట్టాన్ని తిరగరాసి పారదర్శక పాలనకు పెద్ద పీట వేస్తూ రైతులు కష్టాలు తీర్చడమే ధ్యేయంగా భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చా మన్నారు. పదేళ్లలో రైతులు పడ్డ కష్టాలు, బాధలు.. ఏ విధమైన సమస్య లను ఎదుర్కొన్నారో చెప్పడానికి ఇటీవల నిర్వహించిన రెవెన్యూ సదస్సులే ప్రత్యక్ష నిదర్శనమన్నారు. మూడు దశల్లో దాదాపు 10 లక్షలకు పైగా భూ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులు వచ్చాయన్నారు. ఏప్రిల్ 14వ తేదీన భూ భారతి చట్టాన్ని ఆవిష్కరించుకున్నామని, నాటి నుంచే రెవెన్యూ వ్యవస్థలో నూతన శకం ప్రారంభమైందన్నారు. ఈచట్టాన్ని దశల వారీగా అమలులోకి తీసుకొస్తున్నామన్నారు. మొదటి దశలో ఏప్రిల్ 17 నుంచి 30వ తేదీ వరకు నాలుగు మండలాల్లో నిర్వహించిన 72 రెవెన్యూ సదస్సుల్లో 12వేల దరఖాస్తులు, తర్వాత రెండో దశలో మే 5వ తేదీ నుంచి 28 మండలాల్లో నిర్వహించిన 414 సదస్సుల్లో 46 వేల దరఖాస్తులు వచ్చాయని మంత్రి చెప్పారు. ఇందులో సాదాబైనామాల అంశం మినహా సుమారు 60శాతం పైగా సమస్యలకు పరిష్కారం చూపామన్నారు.

## సింధునదీ జలాల పునరుద్ధరణ

# ఒప్పందంలో వెనక్కి తగ్గేదే లే

### స్పష్టం చేసిన కేంద్రమంత్రి షా



**న్యూఢిల్లీ,జూన్, 21:** సింధు నది జలాల ఒప్పందం పునరుద్ధించే విషయంలో ఏ మాత్రం తగ్గేది లేదని కేంద్ర హోం మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. పాకిస్థాన్ ఒప్పందం నిబంధనలను ఉల్లంఘించిందని ఇక నీటి కొరతతో అల్లాడాల్సిందేనని అన్నారు. అమిత్ షా ఈ ఒప్పందంనిలిపివేత గురించి జాతీయ మీడియా చానల్ కు ఇచ్చిన ఇంటర్వ్యూలో చర్చించారు. సింధూ నది జలాలను నిలిపివేసే హక్కు భారత్ కు ఉంది. ఏక పక్షంగా రద్దు చేయలేం. కానీ ఒప్పందం సరిగా పాటించకుండా ఉల్లంఘించిన పాక్ కు భారత్ నీటిని నిలిపివేసే హక్కు ఉందని తెలియజేస్తోంది. భారత్ కు హక్కుగా వచ్చిన నీటిని కచ్చితంగా ఉపయోగించుకుంటాం. సింధు నదిపై మరో కెనాల్ నిర్మించి పాకిస్థాన్ కు నీళ్లు వెళ్లకుండా రాజస్థాన్ కు తరలిస్తామని చెప్పారు.

దీంతో ఆ దేశం గొంతు ఎండుతుందని స్పష్టం చేశారు.

పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడి నేపథ్యంలో సింధు నది జలాల ఒప్పందాన్ని భారత్ రద్దు చేసుకున్న విషయం తెలిసిందే. ఈ ఒప్పందం నిలిపివేత గురించి పాకిస్థాన్ అంతర్జాతీయంగా ఒత్తిడి తెస్తోంది.

పాక్ లో వ్యవసాయానికి 80 శాతం సింధు నది నుంచి వెళ్లిన నీటిని వాడుకుంటారు. పాకిస్థాన్ జీడీపీలో 25 శాతం ఈ నదుల నుంచే లభిస్తోంది. దీంతో ఈ వర్షాకాలంలో పాకిస్థాన్ లో ఎలాంటి పరిస్థితి ఉండబోతుందో అని అందరూ చర్చించుకుంటున్నారు.

# ఇది బేడీల రాజ్యం

### రేవంత్ సర్కార్ పై హరీశ్ రావు హాట్ కామెంట్స్

**జిన్నారం,జూన్ 21,తెలంగాణ దిశ:** జిన్నారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద బీఆర్ఎస్ కోఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రైతుబంధు నిధుల కోసం రైతుల ధర్నా కార్యక్రమంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పటాన్చెరువునియోజకవర్గంలో నాలుగు మండలాలకు సంబంధించి రెండు లక్షల ఎకరాలకు రైతుబంధును ప్రభుత్వం ఎగ్గొట్టే ప్రయత్నం చేస్తున్నదన్నారు. పటాన్చెరువు రైతులు చేసిన పాపం ఏమిటని ప్రశ్నించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఏతులకు పోయి పదికి పదిహేను ఇస్తాను అని కోతలు కోసిన ఏతుల రాయుడు



నేడు రైతుబంధును ఎగ్గొట్టే ప్రయత్నం చేస్తున్నాడని దుయ్యబట్టారు.ఆనాడు కెసిఆర్ హయాంలో రైతులకు వరినాట్ల సమయంలో రైతుబంధును ఇస్తే నేడు ఓట్ల సమయంలో ఇచ్చే విధంగా రేవంత్పాలన సాగుతుందన్నారు.

కరోనా కష్టకాలంలో సైతం ఎమ్మెల్యేల జీతాలను బందు చేసి రైతులకు సహాయం అందించిన ఘనత కేసీఆర్ దని గుర్తు చేశారు. నాడు రెండు లక్షల రుణమాఫీ ఒకేసారి చేస్తామన్న కోతల ప్రభుత్వం ఇంతవరకు దాని ఊసే లేదని గుర్తు చేశారు. రైతు చనిపోతే పది రోజుల్లో వారి కుటుంబానికి రైతు భీమా ద్వారా పది లక్షల రూపాయలు అందించిన ఘనత కేసీఆర్ కే దక్కిందన్నారు. దేవుళ్ళపై ఒట్టు పెట్టి మాట తప్పిన ఘనత ఎగవేతల రాయుడు రేవంత్ దే అన్నారు. లగచర్ల రైతుల భూముల హక్కులకై పోరాటం చేస్తే వారి చేతులకు బేడీలను వేసిన ఘనత ఎగవేతల రేవంత్ కి దక్కిందన్నారు.

# బిఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అరెస్ట్

**హైదరాబాద్,జూన్ 21,తెలంగాణ దిశ:** తెలంగాణ రాజకీయాల్లో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. హుజురాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిని శంషాబాద్ విమానాశ్రయంలో వరంగల్ సుబేదారీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఆయనను వరంగల్ కు తరలించారు. కమలాపూర్ మండలంలో గ్రానైట్ క్వారీ వ్యాపారిని బెదిరించి డబ్బులు డిమాండ్ చేశారనే ఆరోపణలపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని సెక్షన్ 308(2),308(4),352 కింద కేసులు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం,మనోజ్ రెడ్డి అనే వ్యక్తి కమలాపూర్ మండలంలోని వంగపల్లిలో గ్రానైట్ క్వారీ నిర్వహిస్తున్నారు. హుజూరాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి తనను రూ. 50లక్షలు ఇవ్వాలని బెదిరించినట్లు మనోజ్ రెడ్డి భార్య ఉమాదేవీ సుబేదారీ పీఎస్‌లో చేసిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే సుబేదారీ పోలీసులు శనివారం తెల్లవారుజా మున శంషాబాద్ ఎయిర్ పోర్ట్ లో అదుపులోకి తీసుకున్నారు.ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అరెస్టుతో సుబేదారి పోలీస్ స్టేషన్ ఎదుట తీవ్రఉద్రిక్తత నెలకొంది. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు,కౌశిక్ రెడ్డి భార్య శాలిని రెడ్డి, కౌశిక్ సోదరుడు ప్రతీక్ రెడ్డి పలువురు బీఆర్ఎస్ నేతలు ఆయనను పరామర్శించేందుకు తరలివస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం,మనోజ్ రెడ్డి అనే వ్యక్తి కమలాపూర్ మండలంలోని వంగపల్లిలో గ్రానైట్ క్వారీ నిర్వహిస్తున్నారు.



## జూరాలకు కొనసాగుతున్న వరద..

# అధికారులు అప్రమత్తం...




**జూరాల ,జూన్ 21,తెలంగాణ దిశ:** ప్రియదర్శిని జూరాల ప్రాజెక్ట్ వద్ద వరద ప్రవాహం కొనసాగుతుంది. దీంతో అధికారులు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. ప్రాజెక్ట్ నీటి మట్టం ప్రస్తుతం 317.800 మీటర్లు (1,042.651 అడుగులు)గా నమోదై ఉంది. ఇది పూర్తిస్థాయి రిజర్వాయర్ మట్టమైన 318.516 మీటర్లకు అత్యంత సమీపంలో ఉంది. దీంతో ప్రాజెక్ట్ భద్రతకు సంబంధించి అన్ని ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు. ప్రాజెక్టు మొత్తం నిల్వ సామర్థ్యం 9.657 టిఎంసీలు కాగా, ప్రస్తుతం 8.222 టిఎంసీల నిల్వ ఉంది. ప్రస్తుతం ప్రాజెక్ట్‌కు 72,000 క్యూసెక్కుల వరద నీరు చేరుతోంది. దీనిని నియంత్రించేందుకు అధికారులు 5 గేట్ల ద్వారా 20,070 క్యూసెక్కులు, పవర్‌హౌస్ ద్వారా 36,415 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

# ముగిసిన ప్రణీత్ రావు విచారణ..

## సిట్ ముందు కీలక విషయాలు వెల్లడి!





**హైదరాబాద్,జూన్ 21,తెలంగాణ దిశ:** ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎస్ఐబీ మాజీ డీఎస్పీ ప్రణీత్ రావు విచారణ ముగిసింది. ఈ నెల 13, 18 తేదీలలో ప్రణీత్ రావును విచారించిన సిట్ అధికారులు ఇవాళ మరోసారి ప్రశ్నించారు. ఈ కేసులో బాధితుల వాంగ్మూలాల ఆధారంగా మరోసారి ప్రణీత్ రావును విచారించినట్లు తెలుస్తోంది. ఎవరి ఆదేశాల మేరకు ఫోన్లు ట్యాప్ చేశారు? ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో ఎవరిది ప్రధాన పాత్ర అనే కోణంలో సిట్ దర్యాప్తు చేసింది. అయితే ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు ఆదేశాలనే తాను అమలు చేశానని ఆయన ఆదేశాలతోనే హార్డ్ డిస్క్ లు ధ్వంసం చేసినట్లు ప్రణీత్ రావు గతంలోనే సిట్ ముందు అంగీకరించారు. ఈ కేసులో ఏ2గా ఉన్న ప్రణీత్ రావును పోలీసులు గతంలోనే అరెస్టు చేసి కస్టడీకి తీసుకుని విచారించారు.


# స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో ఘనంగా యోగా దినోత్సవ వేడుకలు







**హైదరాబాద్, జూన్ 21, (తెలంగాణ దిశ) :**అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శనివారం తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో ఘనంగా యోగా దినోత్సవ వేడుకలను జరుపుకున్నారు. హైదరాబాద్ నగరంలోని గచ్చిబౌలి స్టేడియం, ఎల్ బి స్టేడియం జింఖానా గ్రౌండ్స్ షూటింగ్ రేంజ్ వాటర్ స్పోర్ట్స్ హుస్సేన్ సాగర్ సైక్లింగ్ విలోడ్రం సరూర్ నగర్ ఇండోర్ స్టేడియం యూసుఫ్ గూడా కేవీబీఆర్ ఇండోర్ స్టేడియంలో యోగ వేడుకలు ఘనంగా జరిగాయి. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్, మేనేజింగ్ డైరెక్టర్ స్పోర్ట్స్ అథారిటీ



మేనేజింగ్ డైరెక్టర్ శ్రీమతి సోనీ బాలాదేవి ఆదేశాల మేరకు అన్ని స్టేడియాల్లో ఈ ఉత్సవాలు నిర్వహించారు. గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో రాష్ట్ర క్రీడలు, యువజన అభివృద్ధి శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, తెలంగాణ స్పోర్ట్స్ థర్టీ చైర్మన్ శివసేనారెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ శ్రీమతి సోనీ బాలాదేవిలు పాల్గొన్నారు. హైదరాబాద్ జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో కేబీఆర్ పార్కులో జరిగిన కార్యక్రమంలో జిల్లా ఇంచార్జీ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, జిల్లా కలెక్టర్ దాసరి హరి చందన, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, కాంగ్రెస్ నాయకుడు ఫిరోజ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు. స్పోర్ట్స్ అథారిటీ వాటర్ స్పోర్ట్స్ ట్రైనింగ్ సెంటర్ హుస్సేన్ సాగర్ లో రోయింగ్ క్రీడాకారులు, జింఖానా గ్రౌండ్ లో స్కేటింగ్ క్రీడాకారులు చేసిన యోగ విన్యాసాలు పలువురిని ఆకట్టుకున్నాయి. అదే విధంగా 33 జిల్లా కేంద్రాల్లో కూడా తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో వివిధ జిల్లాల కలెక్టర్ ల పర్యవేక్షణలో యోగా దినోత్సవం సందర్భంగా పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఒలంపిక్ వారోత్సవాల్లో భాగంగా యోగా డేను అత్యంత ఘనంగా నిర్వహించామని తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ అధికారులు తెలిపారు.



మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కోర్టు న్యాయమూర్తి, జిల్లా లీగల్ సెల్ అథారిటీ చైర్ పర్సన్ ఎస్ఎన్. శ్రీదేవిని జిల్లా కలెక్టర్ మేజిస్ట్రేట్ మిక్కిలినేని మను చౌదరి శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. శనివారం అల్వాల్ లోని లయోలా కాలేజీలో జిల్లా జడ్జితో పాటు ఫస్ట్ అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జి బి. తిరుపతి, 3వ అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జి ఎం. వెంకటేశ్వరరావు లను మర్యాద పూర్వకంగా కలిశారు.

(మేడ్చల్ కలెక్టరేట్, తెలంగాణ దిశ)



# చెరువులు, పార్కులు కబ్జా చేయడంలో హ్యాట్రిక్ సాధించిన బిఆర్ఎస్ నేతలు

## - కాంగ్రెస్ నిజాంపేట్ కార్పొరేషన్ అధికార ప్రతినిధి మల్యాల రమణి

**కుత్బుల్లాపూర్, జూన్ 21, (తెలంగాణ దిశ) :**చెరువులు, పార్కులు కబ్జా చేయడంలో బిఆర్ఎస్ నేతలు హ్యాట్రిక్ సాధించారని కాంగ్రెస్ పార్టీ నిజాంపేట్ కార్పొరేషన్ అధికార ప్రతినిధి మల్యాల రమణి విమర్శించారు. తెలుగుదేశం పార్టీలో నుంచి టిఆర్ఎస్ లో చేరినప్పుడు ఎమ్మెల్యే వివేకానంద ఆస్తులు విలువ ఎంత..? కాంగ్రెస్ నేత హనుమంత్ రెడ్డి ఆస్తుల విలువ ఎంతో బహిరంగ చర్చకు సిద్ధమా అని ఆమె ప్రశ్నించారు. ఈ విషయంలో ఎమ్మెల్యే చెంచాలు కాకుండా ఎమ్మెల్యేనే నేరుగా చర్చకు రావాలని ఆమె డిమాండ్ చేశారు. అధికారం కోసం పార్టీ మారిన ఎమ్మెల్యే వివేకానంద గత పది సంవత్సరాలుగా అధికారంలో ఉండి ఎక్కడ అభివృద్ధి చేశారని ఆమె ప్రశ్నించారు. ఇలా ప్రశ్నిస్తే ఆయన తట్టుకోలేదని ఆమె విమర్శించారు. అభివృద్ధి చేతకాక కబ్జాలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన వివేకానందకు హనుమంత్ రెడ్డిని దూషించే నైతిక హక్కు లేదన్నారు. ఇప్పటికైనా వివేకానంద పద్ధతి మార్చుకోవాలని హితవు చెప్పారు. ఎమ్మెల్యే పై వచ్చిన ఆరోపణలకు ఆయన సమాధానం చెప్పాలే కానీ అనుచరులతో సమాధానం చెప్పించడం ఏమిటని ఆమె ప్రశ్నించారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే కేపీ వివేకానంద రిల్స్ చేయడం తగ్గించి ప్రజలకు పనిచేయాలని



ఆమె సూచించారు. గుమ్మడి కాయ దొంగ అంటే భుజాలు ఎందుకు తడుము కుంటున్నారని ఆమె ప్రశ్నించారు. నియోజకవర్గంలో చెరువులు కుంటలు పార్కులు కబ్జా అయిన విషయం నిజం కాదా అని ఆమె ప్రశ్నించారు. ఎమ్మెల్యే వివేకానందకు వంత పాడుతున్న అనుచరుల చరిత్ర ప్రతి ఒక్కరికి తెలుసని ఆమె అన్నారు. సమయం వచ్చినప్పుడు కబ్జాలన్నీ వెలికి తీస్తామని ఆమె తెలిపారు. ఇప్పటికైనా బిఆర్ఎస్ నేతలు అవాకులు, చెవాకులు మాని బాధ్యతాయుత ప్రతిపక్షంగా వ్యవహరించాలని ఆమె సూచించారు.

# కలెక్టర్ కార్యాలయంలో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు





**మేడ్చల్ కలెక్టరేట్, జూన్ 21, (తెలంగాణ దిశ) :**జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం వేడుకలలో భాగంగా శనివారం యోగా దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ కార్యాలయంలోని అన్ని విభాగాల అధికారులు సిబ్బంది జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ప్రాంగణంలో నిర్వహించిన యోగ వేడుకలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ సి ఉమా గౌరీ మాట్లాడుతూ ఆరోగ్యం శ్రేయస్సు పెంపొందించడం తో పాటు శారీరక, మానసిక శ్రేయస్సుకు యోగా ఒక మార్గం అన్నారు. ఆరోగ్యకరమైన జీవితం కోసం జీవనశైలి మార్పు కోసం మన రోజువారీ జీవితంలో యోగాను అంతర్భాగంగా స్వీకరించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు డాక్టర్ శోభ, డాక్టర్ సత్యవతి, జిల్లా ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ మల్లేశ్వరి, డాక్టర్ గీతా ప్రసాద్, డాక్టర్ చంద్రకళ, డాక్టర్ వినోద్, శ్రీమతి మంజుల, రాజేశ్వర్ రెడ్డి, జిల్లా ఆయుష్ కార్యక్రమ పర్యవేక్షకులు డాక్టర్ శ్రీవల్లి, ఆయుర్వేద సీనియర్ వైద్య అధికారి డాక్టర్ జంగయ్య, ఆయుర్వేద వైద్య అధికారి డాక్టర్ శ్రీదేవి, యోగ ఇన్ స్పెక్టర్ జ్యోత్స్న, కలెక్టరేట్ సిబ్బంది సంతోష్ తదితరులు పాల్గొన్నారు.


# యోగ విశ్వవ్యాప్తం కావడం భారతీయులందరికీ గర్వకారణం





**కుషాయిగూడ, జూన్ 21, (తెలంగాణ దిశ) :**దేశంలో పుట్టిన యోగా విశ్వ వ్యాప్తం కావడంతో భారతీయులందరికీ గర్వకారణమని, యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కోర్టు సెకండ్ మెట్రో పాలిటన్ మేజిస్ట్రేట్ ప్రశాంతి, న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి డి. కిరణ్ కుమార్ అన్నారు. అంతర్జాతీయ దినోత్సవం సందర్భంగా జిల్లా కోర్టు ప్రాంగణంలో శనివారం నిర్వహించిన కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై యోగాసనాలు వేశారు. యోగా మన ప్రాచీన సంప్రదాయం నుండి వచ్చిన ఒక అమూల్యమైన బహుమతి అని తెలిపారు. యోగా మనసు, శరీరం, ఆలోచన, క్రియల ఐక్యతను సూచిస్తుందన్నారు. యోగా కేవలం వ్యాయామం మాత్రమే కాదని ఇది మీతో, ప్రపంచంతో, ప్రకృతితో ఏకత్వం అనే భావనను కనుగొనే మార్గం అని పేర్కొన్నారు. ప్రతి వ్యక్తిత్వ వికాసానికి యోగా ఎంతో గొప్పగా సహాయపడుతుందని, ఏకాగ్రతను, జ్ఞాపకశక్తిని పెంచుతుందన్నారు. ప్రతి మనిషి తన దైనందిన జీవితంలో యోగా చేయడం వల్ల దీర్ఘకాలిక రోగాలైనా బిపి, షుగర్, అల్సర్, అస్తమా వివిధ రకాల నొప్పుల నుండి విముక్తి కలుగుతుందన్నారు . ప్రతీ వ్యక్తి యోగా పట్ల అవగాహనను పెంపొందించుకొని మానసికంగా, శారీరకంగా ఉన్నతగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు అమరేందర్ రెడ్డి ప్రధాన కార్యదర్శి బి. పాపిరెడ్డి న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

# షాపూర్ నగర్ లో ఘనంగా అంతర్జాతీయ యోగ దినోత్సవ వేడుకలు




**కుత్బుల్లాపూర్, జూన్ 21, (తెలంగాణ దిశ) :**సూరారం డివిజన్ షాపూర్ నగర్ ప్రధాన రహదారిలోని ఎంజాయ్ గార్డెన్స్ నందు శివశక్తి యోగా కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలకు బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ యోగాసనాల ద్వారా శారీరక ఉల్లాసం తో పాటు మనసు, ఆలోచన విధానం దృఢంగా మారుతాయని, ప్రతి ఒక్కరూ దైనందిక జీవనంలో యోగాను అలవర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో శివశక్తి యోగా కేంద్రం ఆచార్యులు మల్లేష్, పూర్ణ, విజయ్, కార్పొరేటర్లు మంత్రి సత్యనారాయణ, జగన్, హేమలత సురేష్ రెడ్డి, మహమ్మద్ రషీదా రఫీ, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ యూత్ అధ్యక్షులు దూదిమెట్ల సోమేశ్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, స్థానిక బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




# శక్తి స్వరూపిణి విజయదుర్గ అమ్మవారు

## - ఎమ్మెల్యే వివేకానంద్





**కుత్బుల్లాపూర్, జూన్ 21, (తెలంగాణ దిశ) :**సుభాష్ నగర్ డివిజన్ సూరారం మార్కెట్ రోడ్ లోని శ్రీ విజయ దుర్గా సమేత బంగారు మైసమ్మ దేవాలయం ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవాలకు శనివారం బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శక్తి స్వరూపిణి అయిన విజయదుర్గ అమ్మవారిని కొలవడం ద్వారా చేపట్టిన ప్రతి పనిలో విజయం చేకూరుతుందని అన్నారు. అమ్మవారి దయతో ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ మాజీ కార్పొరేటర్లు గుడిమెట్ల హేమలత సురేష్ రెడ్డి, మంత్రి సత్యనారాయణ, ఫిషరీస్ కో-ఆపరేటివ్ మేడ్చల్ జిల్లా చైర్మన్ మన్నె రాజు, దేవాలయ చైర్మన్ వెంకటస్వామి, యువజన విభాగం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అధ్యక్షుడు దూదిమెట్ల సోమేష్ యాదవ్, జగద్గిరిగుట్ట డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ప్రభాకర్, పందిరి యాదగిరి, గుబ్బాల లక్ష్మీనారాయణ, తారా సింగ్, కావలి రవి, వేణు ముదిరాజ్, గట్టు అశోక్, చెక్క సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రగతి నగర్ శ్రీ లక్ష్మి లేఅవుట్ లో సీసీ రోడ్డు ప్రారంభం





**కుత్బుల్లాపూర్, జూన్ 21, (తెలంగాణ దిశ) :**నిజాంపేట్ కార్పొరేషన్ ప్రగతి నగర్ శ్రీ లక్ష్మి లేఅవుట్ లో సీసీ రోడ్డును కాంగ్రెస్ పార్టీ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇంచార్జీ కొలన్ హన్మంత్ రెడ్డి శనివారం ప్రారంభించారు. 23వ డివిజన్ పరిధిలోనీ శ్రీ లక్ష్మి లేఅవుట్ లో సీసీ రోడ్డు పూర్తిగా పాడువటంతో ఇబ్బందులు పడుతున్నామని కాలనీ వాసులు హన్మంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఆయన కార్పొరేషన్ అధికారులతో మాట్లాడి సిసి రోడ్డు నిర్మాణం కోసం రూ. 25 లక్షల నిధులు మంజూరు చేయించారు. రోడ్డును ప్రారంభించిన అనంతరం కాలనీ వాసులు ఆయనను శాలువాతో సత్కరించి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి, ఎన్ఎంసి అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, కొలన్ జీవన్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు పోచంపల్లి రమేష్‌బాబు, మందలపు రమేష్ బాబు, బండ్ల విజయ్ కుమార్, గోలి శ్రీనివాస్, మురళీకృష్ణ, నాగరాజు, విజయలక్ష్మి, రాణి, అనుపమ, మధు, వాసు, రమణ, మురళి, మహేష్, మందలపు శ్రీహరి, వెంకట్, ప్రవీణ్, సతీష్, సందీప్, నాని, హరిబాబు, వెంకటేశ్వరులు, బొడ్డు విజయ్, రమ, నవ్య, సరితారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# చర్లపల్లి జైల్ లో అంతర్జాతీయ యోగా దినోత్సవం

**చర్లపల్లి, జూన్ 21, (తెలంగాణ దిశ) :**అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా చర్లపల్లి కేంద్ర కారాగారంలో ఖైదీలు, అధికారులు, సిబ్బంది శనివారం యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ యోగా కార్యక్రమంలో జైళ్ళ శాఖ డీజీ డాక్టర్ సౌమ్య మిశ్రా ఐపీఎస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డీఐజీలు డాక్టర్ శ్రీనివాస్ (హైదరాబాద్ రేంజ్), ఎం. సంపత్ (వరంగల్ రేంజ్), చర్లపల్లి సూపరింటెండెంట్ ఎం. శివకుమార్, డిప్యూటీ సూపరింటెండెంట్ కాళిదాస్ గౌడ్, శశికాంత్, రామయ్య, జ్యోతినేశ్వర్ రెడ్డి, కె. శ్రీనివాస్ రెడ్డి, అనిల్ కుమార్ ఇతర జైలు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు. ఈ




కార్యక్రమంలో కె. సునీత తమ యోగా బృందంతో కలిసి అందరి చేత యోగాసనాలు చేయించారు. ఈ కార్యక్రమంలో దాదాపు వెయ్యి మంది శిక్ష ఖైదీలు,150 మంది జైలు సిబ్బంది పాల్గొన్నారు.

# జిల్లాలో 5015 మంది రైతుల ఖాతాలలో రూ. 4.23 కోట్లు జమ

**మేడ్చల్ కలెక్టరేట్, జూన్ 21, (తెలంగాణ దిశ)**రైతు భరోసా పథకం ద్వారా ప్రభుత్వం అన్నదాతకు అండగా ఉంటూ ఆర్థిక చేయూత ఇస్తుందని తెలంగాణ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి ఒక ప్రకటనలో తెలిపారు. రైతు భరోసా పథకం ద్వారా శనివారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో 5015 మంది రైతుల ఖాతాలలో రూ. 4.23 కోట్లు జమ చేయడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. విడతల వారిగా రైతుల ఖాతాల్లోకి రైతు భరోసా నిధులు పడతాయని, వ్యవసాయానికి పెట్టుబడి భారం తగ్గించి, వ్యవసాయం పెంపొందించేందుకు రైతు భరోసా ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని తెలిపారు. వానాకాలం సాగు ప్రారంభానికి ముందే ప్రభుత్వం రైతు భరోసా నిధులు అందించడంపై అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



# సంపాదకీయం

## ఎగుమతులతో భారత్ చరిత్ర

భారతదేశ ఎగుమతులు గణనీయంగా పెరుగుతున్నాయి. ఎగుమతుల్లో చరిత్ర సృష్టించేందుకు సిద్ధమవుతోంది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో భారత్ రికార్డు స్థాయిలో 800 బిలియన్ డాలర్లను సాధిస్తుందని వాణిజ్య, పరిశ్రమల మంత్రి పియూష్ గోయల్ అన్నారు. ఇది దేశ ఆర్థిక వ్యవస్థకు మంచి సంకేతమన్నారు. ఎగుమతుల పరంగా భారతదేశం చరిత్ర సృష్టించే దిశగా పయనిస్తోంది. ఈ విషయంలో వాణిజ్య, పరిశ్రమల మంత్రి పియూష్ గోయల్ సమాచారం ఇచ్చారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో భారత ఎగుమతులు తొలిసారిగా రికార్డు స్థాయిలో 800 బిలియన్ డాలర్లకు చేరువలో ఉంది. జూన్ 2025 తో ముగిసే ఆర్థిక సంవత్సరంలో భారతదేశంలో ఉల్లిపాయ, టమోటా, బంగాళాదుంపల ఉత్పత్తి పెరుగుతుందని భావిస్తున్న సమయంలో కేంద్ర ప్రభుత్వం ఈ సమాచారాన్ని అందించింది. భారత ఎగుమతులు పెరుగుతున్నాయని వాణిజ్య, పరిశ్రమల మంత్రి పియూష్ గోయల్ రాజ్యసభకు తెలిపారు. గత నాలుగు సంవత్సరాలలో ఎగుమతుల్లో మంచి పెరుగుదల నమోదు చేసింది. ఈ సంవత్సరం కూడా పెరుగుదల కొనసాగుతుంది. "భారతదేశ చరిత్రలో తొలిసారిగా, మన ఎగుమతులు 800 బిలియన్ డాలర్లను దాటుతాయి" అని గోయల్ ప్రశ్నోత్తరాల సమయంలో అన్నారు. కాంగ్రెస్ నాయకుడు రాజీవ్ శుక్లా అడిగిన ప్రశ్నకు సమాధానంగా, భారతదేశ ఎగుమతులు పెరుగుతున్నాయని స్పష్టం చేశారు. విదేశీ మారక నిల్వలు పడిపోవడంపై ఉన్న ఆందోళనలను గోయల్ తోసిపుచ్చారు. చాలా నెలలుగా ఇది స్థిరంగా 600 బిలియన్ డాలర్లపైన ఉందని ఆయన అన్నారు. అయితే, దేశీయ కొరత, అధిక డిమాండ్ కారణంగా కొన్ని దిగుమతులు అవసరమని మంత్రి అన్నారు. దిగుమతుల పెరుగుదల ఆర్థిక వ్యవస్థకు మంచి సంకేతం. దేశీయ వినియోగం పెరగడమే దీనికి కారణం. దిగుమతి చేసుకున్న వస్తువులలో పెట్రోలియం ఉత్పత్తులు, కోకింగ్ బొగ్గు, పప్పుధాన్యాలు, తినదగిన నూనెలు ఉన్నాయన్నారు. 'ఉత్పత్తి యూనిట్లను ఏర్పాటు చేసి ప్రారంభించడానికి కొన్ని సంవత్సరాలు పడుతుంది. ఈ కాలంలో, దిగుమతులు స్పష్టంగా పెరుగుతాయి. ఒక ప్రాంతంలో దిగుమతులు పెరిగినప్పుడు, పరిశ్రమలు ఆ ప్రాంతం వైపు ఆకర్షితులవుతాయి. దీనివల్ల ఉపాధి పెరుగుతుంది. పెట్టుబడి కూడా పెరుగుతుంది. 2025-26 బడ్జెట్ మధ్యతరగతికి పన్ను ఉపశమనం కల్పించడం ద్వారా వినియోగ వ్యయాన్ని కూడా పెంచిందని కేంద్ర మంత్రి తెలిపారు. రాజ్యసభలో ఎగుమతుల అద్భుతమైన పనితీరును పియూష్ గోయల్ వివరించారు. దిగుమతులు పెరగడానికి గల కారణాలను కూడా ఆయన వివరించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం కూడా ఎగుమతుల వేగం చెక్కుచెదరకుండా ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. అదే సమయంలో, 2024-25లో ఉల్లిపాయలు, టమోటా, బంగాళాదుంపలు సహా అనేక ఉద్యానవన పంటల ఉత్పత్తి పెరుగుతుందని వ్యవసాయ మంత్రిత్వ శాఖ తెలిపింది. ఉల్లిపాయ ఉత్పత్తిలో గరిష్ట పెరుగుదల 19% ఉంటుంది. దీనితో పాటు, పండ్లు, తోటల పంటలు మరియు సుగంధ ద్రవ్యాల ఉత్పత్తి కూడా పెరుగుతుంది. అయితే, మొత్తం సాగు విస్తీర్ణం గత సంవత్సరం కంటే కొంచెం తక్కువగా ఉంది. ఉల్లిపాయల విషయానికొస్తే, ఈ సంవత్సరం దాని ఉత్పత్తి 288.77 లక్షల టన్నులుగా ఉంటుందని అంచనా. ఇది గత సంవత్సరం 242.67 లక్షల టన్నుల కంటే చాలా ఎక్కువ. టమోటా ఉత్పత్తి కూడా 215.49 లక్షల టన్నులుగా అంచనా వేశారు. బంగాళాదుంప ఉత్పత్తి 595.72 లక్షల టన్నులకు చేరుకుంటుంది. పండ్లలో, మామిడి, ద్రాక్ష, అరటి మంచి ఉత్పత్తి కారణంగా మొత్తం పండ్ల ఉత్పత్తి 1132.26 లక్షల టన్నులుగా ఉంటుందని అంచనా. తోటల పంటల ఉత్పత్తి 179.37 లక్షల టన్నులుగా, సుగంధ ద్రవ్యాల ఉత్పత్తి 119.96 లక్షల టన్నులుగా అంచనా వేశారు. వెల్లుల్లి, పసుపు ఉత్పత్తిలో కూడా పెరుగుదల నమోదైంది. మొత్తంమీద, ఉద్యానవన ఉత్పత్తి 2024-25లో 362.09 మిలియన్ టన్నులకు చేరుకుంటుందని అంచనా, ఇది గత సంవత్సరం కంటే 2.07% ఎక్కువ. అయితే, సాగు విస్తీర్ణం గత సంవత్సరం 29.09 మిలియన్ హెక్టార్ల నుండి ఈ సంవత్సరం 28.84 మిలియన్ హెక్టార్లకు తగ్గింది. మనదేశం నుంచి పెట్రోలియం, రత్నాలు, వ్యవసాయ రసాయనాలు, చక్కెర భారీగా ఎగుమతి అవుతున్నాయి. కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ డేటా ప్రకారం, గత ఐదు సంవత్సరాలుగా ఈ విభాగాలు ప్రపంచ మార్కెట్లలో తమ వాటాను పెంచుకున్నాయి. 2018?2023 మధ్య ఎలక్ట్రికల్ వస్తువులు, న్యూమాటిక్ టైర్లు, ట్యాప్లు, వాల్వ్లు, సెమీకండక్టర్ పరికరాల ఎగుమతులు పుంజుకున్నాయి. 2023లో పెట్రోలియం ఎగుమతులు 84.96 బిలియన్ డాలర్లకు పెరిగాయి. 2018లో 6.45 శాతంగా ఉన్న భారతదేశ మార్కెట్ వాటా గత ఏడాది 12.59 శాతానికి పెరిగింది. 2018లో 16.27 శాతంగా ఉన్న రత్నాల గ్లోబల్ షిప్‌మెంట్‌లలో దేశం వాటా గత ఏడాది 36.53 శాతానికి పెరిగింది. ఇది 1.52 బిలియన్ డాలర్ల ఎగుమతులతో దేశాన్ని అగ్రస్థానానికి చేర్చింది.

# ఉజ్వల భవిష్యత్తు కోసమే యోగ

- కమాండెంట్ దీపక్ కుమార్ శ్రీవాత్సవ్



**భద్రాచలం, జూన్ 21, (తెలంగాణ దిశ)** : అంతర్జాతీయ 11వ యోగ దినోత్సవం పురస్కరించుకొని సీఆర్ పిఎఫ్ 212 బెటాలియన్ ఆధ్వర్యంలో ఘనంగా యోగా డే వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఆర్ పిఎఫ్ సిబ్బంది పాల్గొని యోగాసనాలు చేశారు. ఈ సందర్భంగా కమాండెంట్ దీపక్ కుమార్ శ్రీవాత్సవ్ మాట్లాడుతూ భారతీయ ప్రాచీన సంపద యోగాసనమే అన్నారు. మానసిక ఒత్తిడి జయించటంతో పాటు శారీరక బలాన్ని కూడా యోగా అందిస్తుందని అన్నారు. యోగా ద్వారా మనల్ని మనం నియంత్రించుకోవడంతో పాటు ఉజ్వల భవిష్యత్తును అందించి ప్రస్తుత సమాజానికి ఏ విధంగా ఉపయోగపడతామో అధ్యయనం చేసుకోవచ్చన్నారు. యోగ యొక్క



ప్రాధాన్యతను ప్రపంచ దేశాలే యోగాను గుర్తించాయని, విద్యార్థి దశ నుండి వృద్ధాప్యం వరకు ప్రతి ఒక్కరు యోగాసనాలు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీఎఫ్ సెకండ్ కమాండెంట్ దినేష్ కుమార్, గజేంద్ర బహదూర్ సింగ్, డిప్యూటీ కమాండెంట్ శర్మ తదితరులు పాల్గొన్నారు.




# "ధనం, ఐశ్వర్య, ఆనందం కంటే ముఖ్యమైనది ఆరోగ్యం....యోగ




**కుత్బుల్లాపూర్, జూన్ 21, (తెలంగాణ దిశ)** :యోగ ప్రక్రియ ద్వారా ఆరోగ్యాన్ని పెంపొందించు కోవచ్చునని బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. శనివారం జీడిమెట్ల డివిజన్ సుచిత్రలోని డెకథ్లాన్ వద్ద బిఆర్ఎస్ సీనియర్ నాయకులు నదీమ్ రాయ్ ఆహ్వానం మేరకు "స్టాలియన్ స్ట్రీమ్ ఫిట్ నెస్ డెకథ్లాన్, నవయుగ్ డిజిటల్స్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ 11వ యోగా దినోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచానికి మంచి ఆరోగ్య, అలవాట్లను అందించింది భారత దేశమేనని అన్నారు. యోగ అభ్యాసన ద్వారా ఫిజికల్లీ, మెంటల్లి, ఎమోషనల్లీ, సైకలాజికల్లీ ఫిట్ గా ఉంటామని, తద్వారా చేసే ప్రతి పనిలో విజయం చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉప కమిషనర్ నరసింహ, స్టాలియన్ ఫిట్ నెస్ నిర్వాహకులు సురేష్, అభిషేక్, నవయుగ్ డిజిటల్ నిర్వాహకులు హర్ష , బిజిత్, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు కుంట సిద్ధిరాములు, నదీమ్ రాయ్, సుధాకర్ గౌడ్, నరేందర్ రెడ్డి, సమ్మయ్య నేత, జ్ఞానేశ్వర్ ముదిరాజ్, కాలే గణేష్, బాల మల్లేష్, ఆటో బలరాం, విజయ్ హరీష్ తదితరులు పాల్గొన్నారు.




# యోగ మనిషి జీవన విధానాన్ని మారుస్తూ ప్రశాంతతను కల్గిస్తుంది





**నాగారం, జూన్ 21, తెలంగాణ దిశ)** యోగ మనిషి జీవన విధానాన్ని మారుస్తూ ప్రశాంతతను కల్గిస్తుందని నాగారం సెరినిటి పాఠశాల కరెస్పాండెంట్ నోముల జంగిరెడ్డి తెలిపారు. 11 వ ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా సెరినిటి పాఠశాల ప్రాంగణాలలో శనివారం ఉపాధ్యాయులు, విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జంగిరెడ్డి మాట్లాడుతూ ప్రపంచ యోగాదినోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు. 175 దేశాలలో యోగ నిర్వహిస్తున్నారని, ఇది గర్వించదగ్గ విషయమని, ప్రతి రోజు యోగ, సూర్య నమస్కారం చేసిన యెడల మానసికంగా, శారీరకంగా మనసు ప్రశాంతంగా ఉంటుందన్నారు. అదే విధంగా ఒత్తిడిని జయించటానికి ఉపయోగపడుతుందని తెలిపారు. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రధాన కార్యదర్శి నోముల వసంత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కాప్రా విజయ హైస్కూల్ అంతర్జాతీయ యోగా దినోత్సవం




**కాప్రా, జూన్ 21, (తెలంగాణ దిశ)** :అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని కాప్రా విజయ హైస్కూల్ ప్రాంగణంలో ' యోగా డే'ను శనివారం ఘనంగా నిర్వహించారు. యోగాతో "శారీరక, మానసిక శ్రేయస్సు, ప్రశాంతతకు గణనీయమైన ప్రయోజనాలను పొందవచ్చునని యోగా నిర్వాహకులు డాక్టర్ ఉమా గిరీష్ పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో భాగంగా విద్యార్థులు, యోగాసనాలు, పద్మాసనం, త్రికోణాసనం, ప్రాణాయామం, ధ్యానం తదితర అంశాలలో చక్కని ప్రదర్శనలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగ నిర్వహకులు పి. శ్యాంసుందర్ పాఠశాల కరస్పాండెంట్ కొప్పునూరు రాజేశ్వర్, డైరెక్టర్ కొప్పునూరు వీణ, ప్రిన్సిపాల్ దేవినేని వెంగబాబు, ప్రధానోపాధ్యాయురాలు అద్దంకి పద్మావతి, ఉపాధ్యాయులు, విద్యార్థులుహాపాల్గొన్నారు.



# ప్రగతినగర్ లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన





**కుత్బుల్లాపూర్, జూన్ 21, (తెలంగాణ దిశ)** :ప్రగతినగర్ రెండవ డివిజన్ పరిధిలో శనివారం కాంగ్రెస్ పార్టీ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇంచార్జీ కొలన్ హన్మంత్ రెడ్డి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. కాలనీలో సీసీ రోడ్డు, వీధి దీపాలు పలు అభివృద్ధి లేక ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు హన్మంత్ రెడ్డిని గత నెల క్రితం సంప్రదించారు. దీంతో ఆయన నిజాంపేట్ కార్పొరేషన్ అధికారులతో చర్చించి అభివృద్ధి పనులకు అవసరమైన నిధులను మంజూరు చేయించారు. మున్సిపల్ కార్పొరేషన్ ఫండ్స్ ద్వారా సీసీ రోడ్డు, వీధి దీపాలతో పాటు పలు అభివృద్ధి పనులకు కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. అనంతరం కాలనీ వాసులు హన్మంత్ రెడ్డిని శాలువాతో సత్కరించి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి, ఎన్ఎంసి అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, మహిళ నాయకురాలు రఫియా బేగమ్, డివిజన్ అధ్యక్షులు వీరబాబు, కొలన్ జీవన్ రెడ్డి, అంబారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ యోగ దినోత్సవం సందర్భంగా అందరికీ శుభాకాంక్షలు

- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**మల్లాపూర్, జూన్ 21, (తెలంగాణ దిశ):** ప్రపంచ యోగ డే సందర్భంగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అందరికీ యోగ డే శుభాకాంక్షలు తెలిపారు. శనివారం యోగ డే సందర్భంగా మల్లాపూర్ ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన యోగడే కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ



యోగ అనేది మన శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగు పరచడంలో ఒక అద్భుతమైన సాధనమన్నారు. నిత్యం యోగ సాధన ద్వారా మన జీవనశైలిని మార్చుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ దేవేందర్ రెడ్డి, మీర్ పేట హౌసింగ్ బోర్డు కాలనీ డివిజన్ కార్పొరేటర్ ప్రభుదాస్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




యాదాద్రి భువనగిరి జిల్లాలో తెలంగాణ రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ పర్యటన సందర్భంగా శనివారం భువనగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఎస్సీ ఎస్టీ సమస్యల పైన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎస్సీ ఎస్టీ కమిషన్ రాష్ట్ర చైర్మన్ బక్కి వెంకటయ్య సభ్యులు జిల్లా శంకర్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా యాదాద్రి భువనగిరి జిల్లాలో ఉన్న ఎరుకల కులస్తుల సమస్యలపై తెలంగాణ ఆదివాసి ఎరుకల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు కుతాడి సురేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి కుతాడి యాదగిరి వినతిపత్రం సమర్పించారు.


(భువనగిరి, తెలంగాణ దిశ)



జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి గత కొద్ది రోజుల క్రితం కాలుకు గాయమై హైదరాబాద్ యశోద ఆసుపత్రిలో చికిత్స చేసుకొని తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న ఆయనను శనివారం బిఆర్ఎస్ నేతలు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా మాజీ మంత్రి, సూర్యాపేట శాసనసభ్యులు గుంతకంట్ల జగదీశ్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు చింతల వెంకటేశ్వర్ రెడ్డి,ఆలేరు మాజీ ఎమ్మెల్యే బూడిద బిక్షమయ్య గౌడ్ తదితరులు పరామర్శించారు.

(హైదరాబాద్, తెలంగాణ దిశ)

# ఎమ్మెల్యే పల్లాకు పరామర్శ



ఇటీవల స్వల్ప ప్రమాదానికి గురై హైదరాబాద్ లోని సోమాజిగూడ యశోద హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డిని శనివారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, అంబర్ పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని వాళ్ళు ఆకాంక్షించారు.

(హైదరాబాద్, తెలంగాణ దిశ)

# వేగంగా హై స్పీడ్ ట్రైన్స్...

గాంధీనగర్, : గత కొన్నేళ్లుగా భారత రైల్వే వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటున్నాయి. వందే భారత్, హై స్పీడ్ రైల్, మెట్రో వంటి అత్యాధునిక రైళ్లు ఒక్కొక్కటిగా పట్టాలపైకి ఎక్కి ప్రయాణికులకు సౌకర్యవంతమైందే కాకుండా వేగవంతమైన ప్రయాణాన్ని అందిస్తున్నాయి. ఢిల్లీ నుండి వారణాసి దూరం 840 కి.మీ. ప్రస్తుతం ఈ మార్గంలో రైలులో ప్రయాణించడానికి దాదాపు 12 గంటలు పడుతుంది. ఢిల్లీ-వారణాసిహై స్పీడ్ రైలు కారిడార్ పనులు 2029 నాటికి పూర్తవుతా యి. దీని మొత్తం వ్యయం రూ.43 వేల కోట్లుగా అంచనా వేస్తున్నారు.

# కొండా ఉయ్యాలో.. కోనా ఉయ్యాలో!



తిరువనంతపురం : కేరళలో కొండ ప్రాంతాల్లో ప్రయాణాన్ని ఆహ్లాదకరంగా, సౌలభ్యంగా తీర్చిదిద్దుతూ చేపట్టిన ప్రతిష్టాత్మక హిల్ హైవే ప్రాజెక్టు జీవం పోసుకుంది. రాష్ట్ర ప్రభుత్వం రూ.2895 కోట్ల సొంత నిధులతో చేపట్టిన ఈ రాజమార్గ ప్రాజెక్టులో భాగంగా తొలి దశలో నిర్మించిన 34.76 కిలోమీటర్ల మార్గాన్ని శనివారం నుంచి అందుబాటులోకి తీసుకొచ్చినట్లు ముఖ్యమంత్రి పినరయి విజయన్ తెలిపారు. 1166 కిలోమీటర్ల మేర నిర్మించ తలపెట్టిన ఈ ప్రాజెక్టుకు కేరళ రూ.2,895 కోట్ల తన స్వీయ నిధులు ఖర్చు చేస్తోంది. ఈ ఏడాదిలోపే ప్రాజెక్టులోని ఇతర మార్గాల నిర్మాణం పూర్తి చేస్తామని విజయన్ పేర్కొన్నారు. మౌలిక సదుపాయాలు, పర్యాటకం, వ్యవసాయ రంగాల్లో ఈ ప్రాజెక్టు గేమ్ ఛేంజర్ కానుందని ఆయన చెప్పారు. ఈ మేరకు సామాజిక మాధ్యమాల్లో ఆయన పోస్టు చేశారు. కాగా ప్రారంభోత్సవ కార్యాక్రమానికి రాష్ట్ర ప్రజా పనుల శాఖ మంత్రి పిఎ మహ్మద్ రియాజ్ నేతృత్వం వహించారు. ఈ సందర్భంగా రియాజ్ మాట్లాడుతూ హిల్ హైవే పూర్తి చేయలేరంటూ అనేక రకాలుగా అవహేళనలు ఎదురైనా.. అకుంఠిత దీక్షతో ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తోందని చెప్పారు. కొండ ప్రాంతాలను కలుపుతూ ఏ రాష్ట్రానికి కూడా తన సొంత హైవే లేదని, కేరళకే ఈ ఖ్యాతి దక్కుతుందని ఆయన అన్నారు. స్థానిక ఎమ్మెల్యే లింటో జోసెఫ్‌బీ మాజీ ఎమ్మెల్యే జార్జ్ ఎం థామస్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ మార్గాన్ని ఉరలుంగల్ లేబర్ కాంట్రాక్టర్స్ కార్పొరేషన్ సొసైటీ నిర్మించడం విశేషం.కొండ ప్రాంతాల్లో నివసించేవారికి అత్యంత సౌలభ్యమైన రహదారి అందుబాటులోకి రావడంతో స్థానిక ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

కోజికోడ్‌లోని కొండన్‌చెరి నుంచి కక్కదంపొయిలి వరకు నెల్లిపొయిలి, పుల్లూరంపర, పొన్నన్‌కాయం, పొన్నక్కల్, కూడరన్హి, కూంబర మీదుగా 34.76 కిలోమీటర్ల మేర నిర్మించిన ఈ తొలి దశ మార్గంలో రెండు వంతెనలు, 84 కల్వర్టులు, 42 కిలోమీటర్ల డ్రైన్లు, బస్సు స్టాఫ్‌లు, ఇంటర్ లాక్డ్ ఫుట్‌పాత్‌లతో పాటు ప్రధాన పట్టణాల్లో వీధి దీపాలు కూడా ఏర్పాటు చేశారు.

# టెక్నాలజీ సాయంతో గంజాయి పట్టివేత



**నెల్లూరు,తెలంగాణ దిశ:**నెల్లూరు గంజాయి రవాణాకు స్టాక్ పాయింట్‌గా మారిందన్న ఆరోపణలు ఇటీవల ఎక్కువయ్యాయి. ఒరిస్సాతోపాటు ఏపీలోని విశాఖ ప్రాంతాల నుంచి తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు నిత్యం గంజాయి అక్రమ రవాణా జరుగుతూనే ఉంది. తరచూ హైవేపై పోలీసుల తనిఖీల్లో విలువల కొద్దీ పట్టుబడుతున్న గంజాయి నిల్వలే అందుకు నిదర్శనం. గంజాయి రవాణా స్టార్టింగ్ పాయింట్ నుంచి డెలివరీ పాయింట్ వరకు నేరుగా ఒకేసారి సరఫరా చేయడం సాధ్యం కాదు. ఎందుకంటే నిత్యం వాటిపై నిఘా ఉండడం. విశాఖ నుంచి నేరుగా ఒక్కసారిగా తమిళనాడు లేదా కర్ణాటక లకు తరలించడం సాధ్యం కాకపోవడంతో నెల్లూరును స్టాక్ పాయింట్‌గా ఏర్పాటు చేసుకుని ఇక్కడి నుంచి అనువైన రోజున ఇతర రాష్ట్రాలకు తరలిస్తోంది గంజాయి మాఫియా. ఈ క్రమంలోనే పక్కా సమాచారం పోలీసులకు అందింది. ఇటీవల నెల్లూరు నగరంలో గంజాయి వాడకం ఎక్కువ కావడంతో నిత్యం ఏదో ఒకచోట అల్లర్లు, ఘర్షణలు, హత్యలకు కూడా దారి తీసిన సందర్భాలు అనేకం ఉన్నాయి. ఇందులో భయానకరమైన విషయం ఏంటంటే ఇటీవల కాలంలో విద్యార్థులు కూడా గంజాయి బానిసలుగా మారుతున్నారు. నెల్లూరు పోలీసులు నిర్వహించిన సెర్చ్ ఆపరేషన్‌లో గంజాయి సేకరిస్తున్నది అధిక సంఖ్యలో విద్యార్థులుగా గుర్తించి పోలీసులే షాక్ అయ్యారు. నిత్యం నిఘా ఉంచిన గంజాయి విక్రయాలు ఎక్కడ జరుగుతున్నాయి. ఎక్కడినుంచి కొనుగోలు చేస్తున్నారు. గంజాయి సేవించడం అనేది ఎక్కడ జరుగుతుంది అన్న విషయంలో పోలీసులు చాలా రోజులుగా సమాచారం రాబట్ట లేకపోయారు. తాజాగా నెల్లూరు నగరంలోని మూతపడ్డ ట్రస్ట్ హాస్పిటల్ ఆవరణలో స్మైలింగ్ సహా గంజాయి సేవించే వారు అధికంగా వస్తూ పోతున్నట్లు గుర్తించారు. నేరుగా అక్కడకు పోలీసులు వెళ్లాలంటే దాడులకు తెగబడే అవకాశం ఉంది. అలాగని ఫార్మర్లను పంపిన కూడా ప్రమాదం. కాబట్టి అక్కడ గంజాయి జాడ నిర్ధారించుకునేందుకు నెల్లూరు పోలీసులు టెక్నాలజీని ఉపయోగించారు. డ్రోన్ల సాయంతో ఆ పరిసరాలన్నీ వీడియో రికార్డ్ చేసి అక్కడ అనుమానిత వ్యక్తులు వస్తూపోతుండడం అలాగే గంజాయి సేవిస్తున్న విషయాన్ని నిర్ధారించుకున్నాక పోలీసులు ఒక్కసారిగా రైడ్ నిర్వహించారు. గంజాయి విక్రయాలకు పాల్పడుతున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నారు. ఇందులో ఒకడు.. సజ్జా సాయి. ఆటోడ్రైవర్‌గా ఉన్న సాయి నెల్లూరులో గంజాయి పెడలర్ గా వ్యవహరిస్తున్నాడు. అజీజ్ అనే మరో వ్యక్తి ఒరిస్సా నుంచి భారీగా గంజాయి తీసుకొచ్చి విక్రయిస్తున్నట్లు పోలీసులు విచారణలో తేల్చారు. ఇక తౌసిఫ్ అనే వ్యక్తి ఈ ఇద్దరి నుంచి తీసుకుని గంజాయి అమ్ముకుంటున్న వ్యక్తిగా గుర్తించారు. పోలీసులు జరిపిన దాడుల్లో ముగ్గురి నుంచి భారీగా గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అంతేకాదు నిత్యం గంజాయి సేవిస్తున్న వారిలో ఎక్కువ సంఖ్యలో విద్యార్థులు ఉన్నట్టు గుర్తించారు. వారందరికీ తల్లిదండ్రుల సమావేశంలో కౌన్సిలింగ్ ఇవ్వాలని పోలీసులు నిర్ణయం తీసుకున్నారు. మిగిలిన వారిపై ఎవరెవరు అక్కడికి వచ్చి గంజాయి కొనుగోలు చేస్తున్నారో వారందరిపై కేసులు నమోదు చేసేందుకు సిద్ధమవుతున్నారు నెల్లూరు పోలీసులు

# భయపెడుతున్న కొరియర్ స్కామ్!

**నల్గొండ,తెలంగాణ దిశ:** ఇటీవల కాలంలో సైబర్ మోసాలు పెరిగిపోయాయి. మీ కొరియర్ లో అక్రమ వస్తువులు ఉన్నాయంటూ ఫోన్ చేసి డబ్బు కాజేసేందుకు ప్రయత్నిసున్నారు. ఈ ఘటనల నేపథ్యంలో ప్రముఖ కొరియర్ సంస్థ ఫెడెక్స్... ప్రజలను అప్రమత్తం చేస్తూ కీలక ప్రకటన చేసింది. ఫెడెక్స్ ఉద్యోగుల పేరిట కొందరు మోసాలకు పాల్పడుతున్నారని, అలాంటి వారి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఈ తరహా మోసాలతో బాధితులు ఆర్థికంగా, మానసిక నష్టపోతున్నారని పేర్కొంది. ఆర్థిక మోసగాళ్లు ఫెడెక్స్ లేదా ఇతర కొరియర్ సంస్థల ప్రతినిధులుగా చెబుతూ... మీ పార్సెల్‌లో అక్రమ వస్తువులు ఉన్నాయని తప్పుడు ఆరోపణలు చేస్తారు. బాధితులను నకిలీపోలీస్ అధికారులతోబెదిరించి, న్యాయపరమైన చర్యలు లేదా డిజిటల్ అరెస్ట్ పేరుతో ముప్పుతిప్పలు పెడుతున్నారు. ఈ సమస్యను పరిష్కరించుకోవాలంటే తక్షణమే డబ్బు చెల్లించాలని సైబర్ నేరగాళ్లుఒత్తిడి తెస్తారు. వెంటనేడబ్బు పంపాలని, లేకపోతే అరెస్టు చేస్తామని హడావుడి చేస్తారు. ముందు కొంత మొత్తం చెల్లించాలని ఓ లింక్ పంపుతారు. డబ్బులు పంపిస్తే ...ఇక మోసగాళ్లు అదృశ్యమవుతారు. బాధితులు పూర్తిగా నష్టపోతారు.

ఫెడెక్స్ సూచనలు: ఫెడెక్స్ ఎప్పుడూ అనవసరమైన ఈ-మెయిల్ లేదా ఎస్ఎంఎస్ ద్వారా మీ వ్యక్తిగత సమాచారం లేదా అకౌంట్ వివరాలు కోరదు. ఫెడెక్స్ పోలీసు అధికారులతో ఎలాంటి సంబంధం కలిగి ఉండదు. వారి తరఫున చర్యలు తీసుకోదు. తెలియని నంబర్ల నుంచి వచ్చే కాల్స్‌తో జాగ్రత్తగా ఉండాలి. ఫెడెక్స్ లేదా ఇతర కొరియర్ సంస్థల పేరుతో బెదిరింపులు వచ్చినా నమ్మవద్దు. ఎవరైనా ఫెడెక్స్ లేదా కొరియర్ సంస్థల పేరిట బెదిరిస్తూ డబ్బు అడిగితే, వెంటనే పోలీసులకు లేదా సైబర్ క్రైమ్ విభాగానికి తెలియజేయండి. ఎవరైనా మోసపోతే వెంటనే 1930 నంబర్‌కు కాల్ చేయండి లేదా ఇ.ఎవతీఇ.తీతిఎవ.ఇనీల.తిని వెబ్‌సైట్‌లో రిపోర్ట్ చేయండి. ముఖ్యమైన చిట్కాలు: ఫెడెక్స్ లేదా ఇతర కొరియర్ సంస్థల పేరుతో అనవసరమైన సందేశాలు, కాల్స్ వచ్చినప్పుడు జాగ్రత్తగా ఉండాలి. ఏమైనా అనుమానాస్పద సమాచారం ఉంటే, అధికారిక కస్టమర్ కేర్ ద్వారా నిర్ధారించుకోవాలి. పూర్తి సమాచారం తెలుసుకునే వరకు, డబ్బులు పంపకండి లేదా వ్యక్తిగత సమాచారం తెలియజేయవద్దు. మోసాలకు గురైతే, స్థానిక పోలీసులకు తెలియజేయండి లేదా 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌ను సంప్రదించండి.

# హాట్ టాపిక్ గా మారిన సోషల్ ఇంజనీరింగ్

**హైదరాబాద్,తెలంగాణ దిశ:** తెలంగాణలో సామాజిక వర్గాలకు రిజర్వేషన్లు హాట్ టాపిక్ గా మారాయి. దీనికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మ కంగా చేపట్టిన కులగణన సర్వే, ఎస్సీ వర్గీకరణ కారణాలుగా చెప్పవచ్చు. తమ వర్గాల జనాభా లెక్కల కోసం దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న ప్రజల కోరిన మేరకు, కాంగ్రెస్ ప్రభుత్వం కులగణన సర్వే నిర్వహించింది. ఇటీవల సర్వే గణాంకాలను వెల్లడించింది. ప్రభుత్వ కులగణన లెక్కల ప్రకారం... తెలంగాణలోబీసీలు 56.33%, ఎస్సీలు 17.43%, ఎస్టీలు 10.45%, ఓసీలు 13.31% ఉన్నారు. ఏక సభ్య ఎస్సీ కమిషన్ ప్రకారం... ఎస్సీల్లోని 59 కులాలను మూడు గ్రూపులుగా విభజించి 15% రిజర్వేషన్లు ప్రకటించారు. ఈ సర్వే లెక్కలు తప్పంటూ విపక్ష పార్టీలైన బీఆర్ఎస్, బీజేపీలు కొట్టిపారేస్తున్నాయి. ఎస్సీ, ఎస్టీలకు 27% రిజర్వేషన్లు పోగా...మిగిలిన 23% బీసీలకు కల్పిస్తారని ప్రచారంజరిగింది.

అయితే ఈ ఊహాగానాలకు తెర దించుతూ బీసీలకు రాజకీయంగా, విద్య, ఉద్యోగాల్లో 42% రిజర్వేషన్ల కల్పించేందుకు మార్చి మొదటి వారంలో చట్టం చేస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సంచలన ప్రకటన చేశారు. దీంతో ఈ విషయంలో బీఆర్ఎస్, బీజేపీలకు కాంగ్రెస్ చెక్ పెట్టగలిగిందని విశ్లేషకులు అంటున్నారు. అంతేకాకుండా రాష్ట్రం ఆమోదించిన చట్టాన్ని కేంద్రానికి పంపి 9వ షెడ్యూల్‌లో పొందుపరిచి తమిళనాడు తరహా రిజర్వేషన్లు కల్పించాలని కాంగ్రెస్ భావిస్తుంది. అయితే కాంగ్రెస్ కులగణన సర్వేను ప్రతిపక్షాలు టార్గెట్ చేశారు. గతంలో తమ ప్రభుత్వ హయాంలో చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే లెక్కలే కరెక్ట్ అంటూ బీఆర్ఎస్ వాదిస్తోంది. కులగణన సర్వేలో బీసీలను తక్కువగా చూపారంటూ విపక్షాలు ఆరోపిస్తున్నాయి. బీసీల సంఖ్య గతం కంటే పెరిగిందని కాంగ్రెస్ వాదన. రిజర్వేషన్లపై చట్టం చేయనున్న కాంగ్రెస్ ప్రభుత్వం....ఈ అంశాన్ని జాతీయ అంశంగా మారుస్తున్నట్టు కనిపిస్తుంది.

తెలంగాణ ప్రభుత్వం ఆమోదించిన చట్టంపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందా? తమిళనాడు తరహా రిజర్వేషన్లకై కృషి చేస్తుందా? బీసీ రిజర్వేషన్లపై ఆ పార్టీ వైఖరి ఏంటి? అనేది ఉత్కంఠ రేపుతుంది. చేపట్టిన కులగణన సర్వే కేంద్రంలోని ఎన్డీఏను కలవరపెడుతు ందని కాంగ్రెస్ వాదిస్తుంది. కులగణన లెక్కల ప్రకారం ఆయా వర్గాలకు రిజర్వేషన్ల పెంపు, ప్రభుత్వ విధానపరమైన నిర్ణయాల్లో వారికి సముచిత స్థానం కల్పిస్తామని కాంగ్రెస్ అగ్రనేతలు హామీ ఇస్తున్నారు.

కులగణనతో దేశదృష్టిని ఆకర్షించే ప్రయత్నం చేస్తుంది కాంగ్రెస్. తెలంగాణ బాటలో దేశంలోని ఇతర రాష్ట్రాల్లో కూడా కులగణన చేపట్టి మెజారిటీ వర్గాలకు దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పిస్తారన్న చర్చతెరపైకి వచ్చింది. తెలంగాణలో కాంగ్రెస్ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వేను అస్త్రంగా మార్చుకోవాలని కాంగ్రెస్ అధిష్ఠానం భావిస్తోంది. ఆపార్టీ దేశవ్యాప్తంగా ఈ అంశాన్ని లేవనెత్తేందుకు ప్రయత్నం చేస్తోందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# బీజేపీ టార్గెట్ బీఆర్ఎస్..!



**హైదరాబాద్,తెలంగాణ దిశ:** తెలంగాణలో పట్టు సాధించేందుకు బీజేపీ కొత్త ఎత్తులు వేస్తోందా? బీఆర్ఎస్ టార్గెట్ గా ఇప్పటి నుంచి అడుగులు వేస్తోందా? సమయం, సందర్భం వచ్చిన బీఆర్ఎస్ పార్టీపై మాటల దాడిని పెంచిందా? తెలంగాణ అప్పల కుప్పగా మారిందని ఆర్థికమంత్రి నిర్మల సీతారామన్ ఎందుకన్నారు? రేవంత్ సర్కార్ ఏడాదిగా ఇదే విషయాన్ని చెబుతోందా? ఇప్పుడు లెక్కలతో సైతం బయటపెట్టడం తో ఆ పార్టీ నేతలు ఉక్కిరి బిక్కిరి అవుతున్నట్లు కనిపిస్తోంది. రాష్ట్రాన్ని పదేళ్లు బీఆర్ఎస్ సర్కార్ అప్పుల కుప్పగా మార్చిందని రేవంత్ సర్కార్ పదేపదే చెబుతోంది. అవన్నీ రాజకీయ విమర్శలుగా కారు నేతలు చెప్పడం మొదలుపెట్టారు. రాష్ట్రం ఏర్పడినప్పుడు మిగులుగా ఉండేది తెలంగాణ. గడిచిన పదేళ్లలో ఖజానాను ఖాళీ చేసింది కేసీఆర్ సర్కార్. ఈ విషయాన్ని అధికార పార్టీ నేతలు పదే పదే చె బుతున్నారు. వారు చేసిన అప్పులకు ప్రతీ నెలావడ్డీ వేలకోట్ల రూపా యలు వడ్డీ రూపంలో చెల్లిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి,డిప్యూ టీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో అనేక ప్రాజెక్టులు కట్టామని, దానివల్లే తెలంగాణలో రైస్ అధికంగా పడుతోందంటూ కారు పార్టీ నేతలు మీడియా ముందు ఒకటే రీసౌండ్. బీఆర్ఎస్ అధికారం పోయిన తర్వాత ప్రాజెక్టు కుంగడం, వేల కోట్ల రూపాయలతో నిర్మించిన సచివాలయం పెచ్చులు ఊడడం మొదలైంది. దీంతో ఏం జరిగిందని తెలుసుకునేందుకు తెలంగాణ ప్రజలు ప్రయత్నం చేస్తున్నారు. బడ్జెట్ సందర్భంగా రాజ్యసభలో చర్చ జరిగింది. ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ తెలంగాణ గురించి కీ లకవిషయాలు వెల్లడించారు. విభజన తర్వాత మిగులు బడ్జెట్ రాష్ట్రంగా వున్న తెలంగాణను అప్పుల కుప్పగా మార్చారని చెప్పుకొచ్చారు. విభజన చట్టం కింద ఇచ్చిన హామీలను కేంద్రం అమలు చేయడం లేదంటూ కాంగ్రెస్ ఎంపీ రేణుకా చౌదరి చేసిన వ్యాఖ్యలపై కేంద్రమంత్రి రియాక్ట్ అయ్యారు. గడచిన పదేళ్లలో తెలంగాణకు కేంద్రం ఏమేమి చేసిందనేది వివరించారు. మెదక్‌లో తొలిసారి రైల్వేస్టేషన్, రామగుండం ఎరువుల ఫ్యాక్టరీ,నిజామాబాద్‌లో పసుపు బోర్డును కేంద్రం ఏర్పాటు చేసిందన్నారు. జహీరాబాద్‌లో పారిశ్రామిక కారిడార్ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన విషయాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. సమ్మక్క- సారక్క గిరిజన విశ్వవిద్యాలయం, వరంగల్ లో కాకతీయ మెగా టెక్స్‌టైల్స్ పార్కు, బీబీనగర్‌లో ఎయిమ్స్‌ను ఏర్పాటుచేశామని వెల్లడించారు. భారత్ మాల ప్రాజెక్టు క్రింద నాలు గు గ్రీన్ కారిడార్లను తెలంగాణలో ఏర్పాటు చేశామని వివరించారు మంత్రి నిర్మల. జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టులను రికార్డు స్థాయిలో మంజూరు చేశామన్నారు. ఐదు వందే భారత్ రైళ్లను తెలంగాణలో ప్రారంభించిన విషయాన్ని గుర్తు చేశారు. రాష్ట్రంలో వెనుకబడిన జిల్లాలకు మొత్తం రూ. 2700 కోట్లు మంజూరు చేశామన్నారు. బయ్యారం ఉక్కు పరిశ్రమ ఎక్కడంటూ ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ ప్రశ్నించారు. మంత్రి నిర్మల మాటలన్నీ బీఆర్ఎస్ కే తగిలాయని అంటున్నారు అధికార పార్టీ నేతలు. మిగులు తెలంగాణను బీఆర్ఎస్ సర్కార్ అప్పుల కుప్పగా మార్చిందని గుర్తు చేస్తున్నారు. మొత్తానికి బీజేపీ సందర్భాన్ని బట్టి బీఆర్ఎస్ ను ఇరుకున పెట్టే ప్రయత్నం చేస్తుందని చెప్పవచ్చు.

# శ్యామల కామెంట్స్...
# షర్మిలకు సపోర్టేనా..?



**హైదరాబాద్,తెలంగాణ దిశ:**బ్రహ్మ ఆనందం సినిమా రిలీజ్ సంధర్భంగామెగాస్టార్ చిరంజీవి సరదాగా పలు కామెంట్స్ చేశారు. తన ఇంటిలో తనకు లే డీస్ హాస్టల్ వార్డెన్ అనే ఫీలింగ్ వస్తుందని మెగాస్టార్ అన్నారు. త మవారసత్వాన్ని కొనసాగించేందుకు వారసుడిని ఇవ్వాలని, రామ్ చరణ్ కు చెప్పినట్లు తన మదిలో మాట సరదాగా మెగాస్టార్ చెప్పారు. ఈ కామెంట్స్ కాస్త వివాదంగా మారాయి. మెగాస్టార్ చేసిన కామెంట్స్ పైవైసీపీ అధికార ప్రతినిధి,యాంకర్ శ్యామల స్పందించారు. కుమారులే వారాసులవుతారా?కుమార్తెలు వారసులు కారాఅంటూ శ్యామల ప్రశ్నించారు. అంతటితో ఆగక,కోడలు ఉపాసన అన్ని రంగాలలో రా ణిస్తూ వారసత్వాన్ని అందిపుచ్చుకోలేదా అంటూ శ్యామల ప్రశ్నించారు. శ్యామల కామెంట్స్‌ని బట్టి కుమార్తెలు కూడా వారసులవుతారని ఆమె అభిప్రాయం. ఈ కామెంట్స్ సెగనేరుగా మాజీ సీఎంజగన్‌కు తగిలా యని సోషల్ మీడియా కోడై కూస్తోంది. వైఎస్ జగన్ ఆమె సోదరి వైఎస్ షర్మిళ మధ్య ఆస్తి తగాదాలు ఉన్న విషయం అందరికీ తెల్సిందే. ఇటీవల ఆస్తి తగాదాలు వెలుగులోకి రాగా, పరస్పర విమర్శల జోరు సాగింది. షర్మిళ తన మాటలతో జగన్ పై అస్త్రాలు సంధించగా, జగన్ కూడా అదే రీతిలో స్పందించారు. కన్నతల్లిపై కేసు పెట్టారని, ఇదేనా తల్లికిఇచ్చే గౌరవం అంటూ షర్మిళ ఫైర్అయ్యారు. తనపై సోషల్ మీడియాలో పోస్టింగ్‌లు పెట్టించిన ఘనత కూడా అన్నదే అంటూ సంచలన కామెంట్స్ చేశారు. వీరి ఆస్తుల వివాదం బాగా ముదిరి, చివరకు న్యాయస్థానాలకు చేరింది. ప్రస్తుతం ఈ అంశం కోర్టు పరిధిలో ఉంది. జగన్ జైలుకు వెళ్లిన సమయంలో షర్మిళ.. వైసీపీ బలోపేతానికి చేసిన కృషి అందరికీ తెలిసిందే. ఓదార్పుయాత్ర కొనసాగించి పార్టీకి బూస్ట్ ఇచ్చారని క్యాడర్ చెబుతుంటారు. అయితే వైసీపీ అధికారంలోకి రాగానే, షర్మిళ ను జగన్ పక్కన పెట్టేశారని పలుమార్లు షర్మిళ భర్త అనిల్ ఆరోపించారు. తమకు ఆస్తుల తగాదాల వల్లే విభేధాలు వచ్చాయని అనిల్ తెగేసి చెప్పారు. దివంగత సీఎం వైఎస్సార్ వారసురాలిగా తనకు హక్కు ఉందన్న వాదనను షర్మిళ వక్కాణించి పలికారు. జగన్ కు ఉన్న హక్కు తనకు ఉందంటూ, వైఎస్సార్ సూచించినట్లుగా ఆస్తుల పంపకాలు జరగాలన్నది ఆమె వాదనవీరి ఆస్తి వివాదం వల్ల వైఎస్సార్ అభిమానులు కూడా రెండు గ్రూపులుగా తయారయ్యారని రాజకీయ విశ్లేషకుల అంచనా. ఇలాంటి తరుణంలో మెగాస్టార్ చేసిన కామెంట్స్‌పై గురిపెట్టిన శ్యామల, స్పందిస్తూ చేసిన కామెంట్స్ నేరుగా జగన్ కు తగిలాయని టీడీపీ విమర్శిస్తోంది. అలాగే జనసేన కూడా.. షర్మిళ గతంలో ఆస్తి పంపకాలపై చేసిన కామెంట్స్ ని పోస్ట్ చేస్తూ.. శ్యామల గారూ.. ఇదే మాట మీ అధినేతకు చెప్పండని కో రుతున్నారు. తండ్రికి కుమార్తెలు వారసులుగానే పరిగణించ బడతారని, షర్మిళకు రావాల్సిన ఆస్తిని అలాగే అప్పజెప్పేలా చూడాలని శ్యామలను కూటమి నేతలు కోరుతున్నారు. శ్యామల తనకామెంట్స్‌తో మెగాస్టార్ ను ఇరుకునపెట్టేందుకు ప్రయత్నిస్తే, ఆ కామెంట్స్ ను మాజీ సీఎం జగన్ కు ఆపాదించి జనసేన, టీడీపీ పోటాపోటీగా ట్రోలింగ్ చేస్తున్నాయి.

# అదనపు కట్నం ఇవ్వనందుకు హెచ్ఐవీ ఇంజెక్షన్!
## ఉత్తరాఖండ్‌లో కోడలిపై అత్తింటివారి దారుణం..?



హరిద్వార్: అదనపు కట్నం చెల్లించలేదనే కోపం తో అత్తింటివారు కోడలికిహెచ్ఐవీ ఇన్ఫెక్టెడ్ ఇంజెక్షన్‌ను ఇచ్చారని బాధితురాలి తండ్రి ఆరోపించారు. ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్ ప్రాంతానికి చెందిన అభిషేక్ వురపు సచిన్‌కు సోనాల్ సైనీని ఇచ్చి 2023లో వివాహం చేశారు. ఓకారు, రూ.15 లక్షల నగదు వరునికి కట్నంగా ఇచ్చారు. కొంత కాలం తర్వాత స్కార్పియో కారు, రూ.25 లక్షలు కట్నంగా ఇవ్వాలని వరుని బంధువులు డిమాండ్ చేశారు. అందుకు సోనాల్ తండ్రి అంగీకరించలేదు. దీంతోఅభిషేక్ బంధువులు సోనా ల్‌కు హెచ్ఐవీఇన్ఫెక్టెడ్ ఇంజెక్షన్ ఇచ్చారు. దీంతో ఆమె ఆరోగ్యం క్షీణించడం ప్రారంభమైంది. వైద్య పరీక్షల్లో ఆమెకు హెచ్ఐవీ పాజిటివ్ అని తేలింది. ఆమె భర్త అభిషేక్‌కు హెచ్ఐవీ నెగెటివ్ అని తెలిసింది. దిగ్భ్రాంతికి గురైన సోనాల్ తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కానీ పోలీసులు పట్టించుకోలేదు. బాధితులు వెంటనే కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాల మేరకు గంగోహ్ కొత్వాలి పోలీసులు కేసు నమోదు చేశారు. సోనాల్‌పై దాడి, హత్యాయత్నం, వరకట్న వేధింపులకు పాల్పడినట్లు అభిషేక్‌తోపాటు అతని తల్లిదం డ్రులు, ఇతర కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేశారు.

# మత్తుకు బానిసై...!

**హైదరాబాద్,తెలంగాణ దిశ:** మత్తుకు బానిసైన ఓ యువకుడు తాను నివాసం ఉంటున్న ఫ్లాట్‌లోనే గంజాయి మొక్కలను సాగు చేశాడు. ఈ విషయం ఇరుగుపొరుగు వాళ్ల ద్వారా పోలీసులకు తెలిసింది. దీంతో ఆ ఇంటిపై దాడిచేసి యువకుడిని అదుపులోకి తీసుకున్నారు.

పోలీసుల కథనం ప్రకా రం.. హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ వెంకటగిరిలోని బేయిగ్ రెసిడెన్సీలోని ఫ్లాట్ నంబర్ 401లో మహమూద్ అలీ (20) అనే యువకుడు నివాసం ఉంటున్నాడు. ఆటో నడుపుకునే మహమూద్ అలీ కొంతకాలంగా గంజాయికి అలవాటు పడ్డాడు. ఈ క్రమంలోనే మంగళ్‌హాట్, ధూల్‌పేట నుంచి గంజాయి సీక్రెట్‌గా తెచ్చుకుని సేవించేవాడు. కానీ ఈ మధ్య డ్రగ్స్, గంజాయిపై సీరియస్ యాక్షన్ తీసుకుంటుండటంతో సులువుగా గంజాయి దొరకడం లేదు.

# ప్రజా సంక్షేమం కోసమే కుల గణన: ఎమ్మెల్యే



**భువనగిరి,తెలంగాణ దిశ:** అన్ని వర్గాల ప్రజల సమగ్ర అభివృద్ధి కోసమే సామాజిక కులగణనం చేపట్టాలని ప్రభుత్వం సంకల్పించిందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, ఎంపీ చామల్ కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. ప్రభుత్వం చేపట్టిన ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమం విజయవంతం చేసేందుకుప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఆర్థిక సామాజిక పరిస్థితులను క్షుణ్ణంగా సేకరించి సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ప్రభుత్వంనిర్ణయం తీసుకుందన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ,భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ,జిల్లా అధ్యక్షుడు అండేం సంజీవరెడ్డి ,తదితరులు పాల్గొన్నారు. నవంబర్ 11.00 ల నుంచి మధ్యాహ్నం 1.00ల వరకు విద్యుత్ వినియెగదారుల దినోత్సవ కార్యక్రమం భువనగిరి విద్యుత్ డివిజన్ ఆఫీస్ ఆవరణలో ఏర్పాటు చేసినట్లు పట్టణ డివిజన్ వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగదారులందరు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. పెండింగ్ బిల్లులు తామెదురుకుంటున్న సమస్యలను తమ దృష్టికి తెస్తే పరిష్కరిస్తామని ఆయన అన్నారు. ధరణి మాడ్యూల్స్ లో ఉన్న పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు సంబంధిత అధికారులను ఆదేశించారు. మినీ మీటింగ్ హాల్ లో జిల్లా రెవెన్యూ డివిజనల్ అధికారులు, మండల తహసీల్దార్ లకు మార్గ నిర్దేశం చేశారు. ధరణి, మీసేవ, షాదిముబారక్, కల్యాణలక్ష్మి, ఓటరు నమోదు, పై రివ్యూ నిర్వహించడం జరిగింది. రెవిన్యూ యాంత్రాగం జరగకుండా , ప్రధాన భూమిక పోషించాలన్నారు. ధరణి మాడుల్స్ లో ఉన్న దరఖాస్తుల పరిష్కారానికి చేపడుతున్న చర్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి క్లియర్ చేయాలని అన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)వీరారెడ్డి, భువనగిరి ఆర్డి ఓ కృష్ణారెడ్డి చౌటుప్పల్ ఆర్డిఓ శేఖర్ రెడ్డి, మండలం తహసీల్దార్ లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ రోజు యాదాద్రి భువనగిరి జిల్లా కొత్త కలెక్టర్‌ను జిల్లా రెడ్ క్రాస్ వైస్ ఛైర్మన్ దిడ్డి బాలాజీ, డివిజన్ ఛైర్మన్ సద్ది వెంకట్ రెడ్డి జిల్లా ఆఫీసులో కలిశారు. రెడ్ క్రాస్ అభివృద్ధి గూర్చి వివరించారు.

# ఐరిస్ ఇస్తేనే డబ్బుల జమ



**సారంగాపూర్,తెలంగాణ దిశ:** ఇప్పటి వరకు ఓటీపీపద్ధతి ద్వారా కొనుగోళ్లు చేపట్టి అమలు చేస్తుండగా ప్రస్తుతం తప్పనిసరిగా ఐరిస్ అమలు చేయాలని కేంద్రాల నిర్వాహకులకు పరికరాలను అందజేశారు. ధాన్యం విక్రయించిన తరువాత రైతు ఐరిస్(కనుపాపల)ను స్కానింగ్ చేసినప్పుడే ఖాతాల్లో నేరుగా డబ్బులు జమ కానున్నాయి. ఈ విధానంతో రైతుల పేర ఎవరైనా అక్రమంగా విక్రయాలు సాగించేందుకు అవకాశం లేకుండా ఉండనుంది. అంతేకాకుండా గతంలో కేంద్రాల నుంచి ధాన్యం తరలించే సమయంలో మిల్లర్లకు ట్రక్ షీట్‌లో కేవలం సంచుల వివరాలు మాత్రమే నమోదు చేసి పంపించే వారు. ప్రస్తుతం లారీలో ఎంత మంది రైతుల ధాన్యాన్ని పంపిస్తున్నారు, ఎన్ని క్వింటాళ్లు పంపించారు అనే వివరాలు ట్రక్‌షీట్‌లో పొందుపరచాలని ఆదేశించారు. నూతన విధానంతో ధాన్యం విక్రయాల్లో పారదర్శకత ఉండనుందని అధికారులు, రైతులు భావిస్తున్నారు. ముందుగా రైతు కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకు రాగానే టోకెన్ నంబర్ అందించి, రైతు, భూమి వివరాలు తీసుకొని ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. వ్యవసా యాధికారులు నమోదు చేసిన పంటల వివరాలు ఆన్‌లైన్‌లో కనిపిస్తాయి. దీని ఆధారంగా రైతు కేంద్రానికి తీసుకొచ్చిన ధాన్యం ఎంత, సాగు చేసిన పంట మాత్రమే నమోదు అవుతుంది. ధాన్యం సేకరణలో గన్నీ సంచుల వివరాలు, విక్రయించిన సంచుల వివరాలు, నాణ్యత పూర్తిగా నమోదు చేయాల్సి ఉంటుంది. వీటన్నింటి ఆధారంగా తూకం వేసిన సంచుల వివరాలు నమోదు చేయగానే రైతు ఐరిస్‌ను తీసుకుంటారు. ప్రస్తుతం తప్పనిసరిగా రైతు ఉండాల్సిందే. ఐరిస్ విధానంతో అక్రమాలు జరగకుండా, రైతు ఉన్నప్పుడే ధాన్యం విక్రయించుకొనే అవకాశముంది. రైతు సాగు చేసిన పంటల వివరాలు వ్యవసాయాధికారులు ముందుగానే నమోదు చేయడంతో దీని ఆధారంగా విక్రయాల వివరాలు ఆన్‌లైన్ చేయాల్సి ఉంటుంది. దీని ద్వారా రైతులకు నేరుగా ఖాతాల్లో డబ్బులు జమ కానున్నాయి.

# అంగన్‌వాడీ కేంద్రాలకు.. ఇక ఆధునిక హంగులు!




**జనగామ,తెలంగాణ దిశ:** అంగన్‌వాడీ కేంద్రాలను అత్యాధునిక రీతిలో తీర్చిదిద్దడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంకల్పించాయి. గ్రామీణ స్థాయిలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇప్పటికే పౌష్టికాహార ప్రాధాన్యత, పిల్లలకు, గర్భిణులు, బాలింతలకు సేవలందిస్తూ పిల్లలకు ప్రీస్కూల్ విద్యను కూడా అందిస్తున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ద్వారా నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలన్నింటినీ "కార్పొరేట్ కిడ్స్ స్కూల్ స్థాయి"లో అత్యాధునిక హంగులు కల్పించడానికి చర్యలు చేపట్టింది. జిల్లాలో కూడా కొద్ది నెలలుగా పలు పనులు ప్రారంభమయ్యా యి. జిల్లాలో మొదటి దశలో 33 అంగన్‌వాడీ కేంద్రాలను ఆధునీకరించి, మెరుగైన వసతులు కల్పించడానికి పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో పనులు చేపట్టారు. తొలుత సొంత భవనాలు ఉన్న కేంద్రాలను ఆధునాతనంగా తీర్చిదిద్దుతున్నారు. అద్దె భవనాల్లో నడుస్తున్న వాటికి నూతన భవన నిర్మాణాల సమయంలోనే తీర్చిదిద్దడానికి నిర్ణయించారు. కేంద్రాల్లో 3–6 ఏళ్ల లోపు పిల్లలు చదువు కోసం వెళ్తున్నారు. వీటిని కార్పొరేట్ కిడ్స్ పాఠశాలల మాదిరిగా తీర్చిదిద్దడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. భవనాలకు రంగులు వేయించడం, తరగతి గదిలో చిన్నారులను ఆకట్టుకునేందుకు బొమ్మల పెయింటింగ్, మరుగుదొడ్ల నిర్మాణం, సురక్షిత నీటి సౌకర్యాలను కల్పించడానికి చర్యలు చేపట్టారు. నూతనంగా ఫర్నీచర్ సమకూరుస్తున్నారు. వీటన్నింటికీ ఒక్కో కేంద్రానికి రూ. 1లక్ష ఖర్చు చేస్తున్నారు. పనుల నిర్వహణ తీరును ఇటీవల జిల్లా పాలనాధికారి రిజ్వాన్‌బాషా కూడా సందర్శించారు. ఇప్పటికే జిల్లాలో కొన్ని కేంద్రాల్లో ఆధునిక హంగుల పనులు పూర్తి కావస్తుండటంతో కార్పొరేట్ కిడ్స్ స్కూళ్లను తలపిస్తున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా మొదటి దశలో సొంత భవనాలు ఉన్న వాటిని తీర్చిదిద్దుతున్నాం. దశల వారీగా మిగతావి కూడా పూర్తి చేస్తాం. పనులు వేగంగా జరుగుతున్నాయి. పనులన్నీ పూర్తయితే చిన్నారులు ఉన్నత స్థాయి ప్రీ స్కూల్‌లో చదువుతున్న అనుభూతి పొందుతారు.

# ప్రైవేట్ వైపే రైతుల మొగ్గు



**భువనగిరి,తెలంగాణ దిశ:** ప్రభుత్వ కొనుగోలు సంస్థల్లో జరుగుతున్న జాప్యంతో రైతులు ధాన్యం వ్యాపారులకు విక్రయిస్తున్నారు. ఈ వానాకాలం సీజన్‌లో ఇప్పటి వరకు ధాన్యం కొనుగోళ్లను పరిశీలిస్తే ప్రైవేట్‌లోనే ఎక్కువగా జరిగాయి. తేమ శాతం ఎక్కువగా ఉండటంతో మిలర్లు, కమీషన్ ఏజెంట్లకు ఏదో ఒక ధరకు విక్రయిస్తున్నారు. క్వింటాకు రూ. 300 నుంచి రూ. 600 వరకు రైతులు నష్టపోతున్నారు. ఈ వానాకాలం సీజన్‌లో వ్యవసాయ మార్కెట్ యార్డులు, కల్లాల్లో మిల్లర్లు, ప్రైవేట్ వ్యాపారులు కలిపి సుమారు 8,024 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయగా... ప్రభుత్వ సంస్థలు ఐకేపీ, పీఏసీఎస్‌ల్లో కేవలం 2,305 ఎంటీల ధాన్యం మాత్రమే కొనుగోలు చేశారు. దాదాపు నాలుగు రెట్లు అధికంగా ప్రైవేట్ వ్యాపారులు కొన్నారు. సెప్టెంబరు చివరి వారం నుంచే ధాన్యం కోతలు ఆరంభం కాగా.. అక్టోబరు రెండో వారం చివర్లో ప్రభుత్వ సంస్థలను తెరిచారు సన్నాలకు ప్రభుత్వం క్వింటాకు రూ. 2,320, రూ. 500 బోనస్ కలిసి రూ. 2,820 చెల్లిస్తుంది. ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాల మేరకు ఉండాలి. కానీ ప్రైవేట్ మార్కెట్‌లో తేమతో సంబంధం లేకుండా క్వింటాకు రూ. 2200 నుంచి రూ. 2400 వందల వరకు విక్రయిస్తున్నారు. 17శాతం తేమ, ఇతర నిబంధనలు లోబడి ఉంటే దొడ్డు రకం ఏ గ్రేడ్ ధాన్యం క్వింటాకు రూ. 2320, సాధా రణ రకానికి రూ. 2,300 కనీస మద్దతు ధర ఇస్తుండగా, ప్రైవేట్‌లోఇవేమి చూడకుండా రూ. 1800 నుంచి 2,150 వరకు వ్యాపారులు చెల్లిస్తున్నారు. సగటు మోడల్ ధర క్వింటాకు రూ. 1950 మాత్రమే ఉంది. ఈ లెక్కన రైతు క్వింటాకు రూ. 450 నష్టపోతున్నారు. భువనగిరి మార్కెట్ యార్డులోనే 2,423 ఎంటీల ధాన్యాన్నిరైతులు విక్రయించారు. కమీషన్ ఏజెంట్లకు నూటికి రూ. 3 కమీషన్ ఇవ్వాల్సి ఉంటుంది. ఈ లెక్కన క్వింటాకు రూ. 600 వరకు నష్టపోతున్నా.. వారికే అమ్ముతున్నారు. మిల్లర్లు కూడా నేరుగా కొంటున్నారు. సీఎంఆర్ ధాన్యం తక్కువగా ఉండటంతో తగ్గిన మొత్తాన్ని కవర్ చేసుకునేందుకు మార్కెట్‌లో తక్కువ ధరకు కొందరు మిల్లర్లు కొంటున్నట్లు సమాచారం.

## వాంకిడి గిరిజన ఆశ్రమంలో ఫుడ్ పాయిజన్



**వాంకిడి,తెలంగాణ దిశ:** వాంకిడి మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఫుడ్ పాయిజన్‌తో 30 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురైన విషయం విదితమే. వాంకిడి ప్రభుత్వ దవాఖానలో చేర్పించగా, చికిత్స అనంతరం 27 మందిని తిరిగి హాస్టల్‌కు చేర్చారు. ఇందులో కొ ంతమంది విద్యార్థినులకు మళ్లీ వాంతులు విరేచనాలు కావడంతో తిరిగి దవాఖానలకు తరలించారు. మంచిర్యాల దవాఖానలో నాలుగురిని చేర్పించగా, మరో ఏడుగురిని కాగజ్‌నగర్, ఆసిఫాబాద్‌లోని దవాఖాలనకు తరలించారు. ఇక మరో నలుగురు వాంకిడి ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతున్నారు. వైద్యసిబ్బంది ఆశ్రమంలో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసి విద్యార్థినులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. అంతకుముందు ఫుడ్ సేఫ్టీ అధికారులు, మిషన్ భగీరథ అధికారులు వచ్చి నీటి, ఆహార పదార్థాల శాంపిళ్లను సేకరించారు. విద్యార్థినుల అస్వస్థతకు కలుషితమై తాగు నీరు, ఆహారమే కారణమని వైద్యులు చెబుతున్నారు. జిల్లా అదనపు కలెక్టర్ దీపక్‌తివారీ ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. విద్యార్థినుల అస్వస్థతకు గల కారణాలను వైద్యసిబ్బందిని అడిగి తెలుసుకు న్నారు. బోరు నీటి శాంపిళ్లను ఆయన పరిశీలించారు.

# ఇళ్లు ఇచ్చారు.. వసతులు మరిచారు



**భూపాలపల్లి,తెలంగాణ దిశ:** గృహాలు లేని నిరుపేదలకు రెండు పడక గదుల ఇళ్లు నిర్మించి పంపిణీ చేశారు. గడిచిన ఎన్నికల ముందు పంపిణీ చేసిన ఇళ్లలో కనీస సౌకర్యాలు కల్పించకపోవడంతో లబ్ధిదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. దీంతో చేసేది లేక కొందరు సొంతంగా తాగునీటి బోర్లు వేసుకున్నారు. రాత్రి సమయంలో ఇళ్లలోకి విష పురుగులు వస్తున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా పారిశుధ్య, తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని కాలనీ వాసులు ఆందోళన చెందుతున్నారు. భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని వేశాలపల్లి సమీపంలో 544 రెండు పడక గదుల ఇళ్లను ఎనిమిదేళ్ల క్రితం నిర్మించారు. నిర్మాణం పూర్తయిన తర్వాత లబ్ధిదారులకు కేటాయించక పోవడంతో 60 ఇళ్లలో గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తాళాలు పగులగొట్టి తలుపులు, కిటికీలు, పైపులు, విద్యుత్తు తదితర వస్తువులను ఎత్తుకెళ్లారు. దీంతో ప్రభుత్వం మళ్లీ మరమ్మతు పనులు చేపట్టారు. కాలనీలో కనీస సదుపాయాలు లేకపోవడంతో కొందరు ఆ ఇళ్లలో ఉండేందుకు ఆసక్తి చూపడం లేదు. ఇంటి పట్టాలు తీసుకున్నా కొందరు లబ్ధిదారులు అద్దె ఇంట్లో ఉంటున్నారు. పారిశుద్ధ్య నిర్వహణ లేకపోవడంతో చెత్తా చెదారం రోడ్డు పక్కన వేయడంతో దోమల బెడదతో పాటు దుర్వాసన వస్తోంది. ఈ కాలనీలో మిషన్ భగీరథ నీటి కోసం ప్రత్యేకంగా 'సంప్' నిర్మించారు. ఈ సంప్ ద్వారా ప్రతి ఇంటికి తాగునీరు అందించేందుకు ప్రభుత్వం రూ. 50 లక్షల నిధులు కేటాయించింది. కానీ ఆ పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. దీంతో కాలనీ వాసులు తాగునీరు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. 544 నిరుపేద కుటుంబాలకు సంబంధించిన ఈ కాలనీలో మౌలిక వసతులు కల్పించే బాధ్యత మున్సిపాలిటీ అధికారులు తీసుకోవాలి. ఇక్కడ పారిశుద్ధ్య నిర్వహణ లేదు. ఇళ్ల ముందు, రోడ్డు పక్కన చెత్తా చెదారం పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోంది. పిల్లలు అనారోగ్యానికి గురవుతున్నారు. ప్రతి నెల కాలనీలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తే పేదలకు మేలు జరుగుతుంది. అన్ని ఇళ్లకు మిషన్ భగీరథ నీటి కోసం ప్రత్యేకంగా పైపులైన్ నిర్మించాలి. ఇళ్లపైన నీటి నిల్వ కోసం ట్యాంకులను అమర్చాలని కలెక్టర్ చెప్పినా ఎవరూ పట్టించుకోవడం లేదు. విషపురుగులు లోపలికి ప్రవేశించకుండా చుట్టూ ప్రహరి నిర్మించాలి. కాలనీలో నెలకొన్ని అన్ని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. మిషన్ భగీరథ నీటి సరఫరా కోసం ప్రత్యేకంగా నిధులు వెచ్చించాం. త్వరలో తాగునీటి పైపులైన్ నిర్మాణ పనులు ప్రారంభిస్తాం. పారిశుద్ధ్య సమస్యను పరిష్కరిస్తాం.

# కరెంటు కష్టాలకు మోక్షమెన్నడో..!




**వెంకటాపురం,తెలంగాణ దిశ:** అంతరాయం లేని కరెంటు సరఫరాపై తెలంగాణ విద్యుత్తు పంపిణీ సంస్థ దృష్టి సారించింది. లోపాలను సవరించడంతో పాటు క్షేత్రస్థాయిలో అవాంతరాలను అధిగమించేందుకు చర్యలు చేపట్టింది. విద్యుత్తు ఉప కేంద్రాల్లోనూ మెరుగైన సదుపాయాలు కల్పించింది. మన్యంలోని వెంకటాపురం, వాజేడు మండలాల్లో పరిస్థితి భిన్నంగా ఉంది. గాలివీచినా.. చినుకురాలినా కరెంటుకు అంతరాయం ఏర్పడుతోంది. సిబ్బంది కొరతతో పునరుద్ధరణలో జాప్యం జరుగుతుండటంతో.. ఇంకె న్నాళ్లకు కరెంటు కష్టాలకు మోక్షం కలుగుతుందోననే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మెరుగైన సరఫరాకు ఏ, బీ స్విచ్‌ల ఏర్పాటుకు మోక్షం లేకుండా పోయింది. కరెంటు లైన్లలో సరఫరాలో తలెత్తే లోపాలను సిబ్బంది త్వరితగతిన గుర్తించడం, పరిష్కారానికి అవకాశం ఉండే వీటిపై దృష్టి సారించకపోవడం విమర్శలకు దారి తీస్తోంది. అదేక్రమంలో నియంత్రిక పరిధిలోనూ వీటిని ఏర్పాటు చేయాలనే ఆదేశాలున్నా.. ఆచరణకు నోచుకోకపోవడంతో.. ఎక్కడ సరఫరాలో అంతరాయం కలిగినా అంతటా కరెంటు నిలిపివేయాల్సి వస్తోంది. దశాబ్దాల క్రితం వెంకటాపురం, వాజేడు, ధర్మవరం, ఆలుబాకలో విద్యుత్తు ఉప కేంద్రాలను ఏర్పాటు చేయగా, వందల్లో ఉన్న కనెక్షన్ల సంఖ్య వేలల్లోకి చేరింది. ఒక్కో ఉప కేం ద్రంలో నలుగురు ఉద్యోగులను నియమించాల్సి ఉండగా ప్రస్తుతం ఇద్దరే రాత్రి, పగలు విధులు నిర్వహిస్తున్నారు. క్షేత్రస్థాయిలో ఉద్యోగుల కొరత వేధిస్తోంది. ఏపీఎస్ఈబీ నిబంధనల మేరకు ప్రతీ 1,500 కనెక్షన్లకు ఒక జేఎల్ఎం పోస్టు భర్తీ చేయాలనే నిబంధన అటకెక్కింది. రెండు మండలాల్లో 35 పంచాయతీల్లో 97 గ్రామాల పరిధిలో సరఫరా జరుగుతుండగా.. ఏఎల్ఎంలు ఆరుగురు, లైన్ ఇన్‌స్పెక్టర్లు ముగ్గురు, అన్‌మ్యాన్డ్ ఒకరు, ఏఈ, సబ్ ఇంజినీర్‌తోనే నెట్టుకొస్తున్నారు. జేఎల్ఎం పోస్టు ఒక్కటీ లేకపోవడం గమనార్హం. వెంకటాపురంలోని విద్యుత్తు సరఫరా సహాయ ప్రాంతీయ ఇంజినీరింగ్ కార్యాలయమిది. మెరుగైన సేవల కోసం 2021లో ఇక్కడ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. రూ.లక్షలు వెచ్చించి భవన సదుపాయం కల్పించారు. ఏడీఈ స్థాయి అధికారి పోస్టును భర్తీ చేశారు. కార్యాలయ నిర్వహణకు అవసరమైన ఏ ఒక్క ఉద్యోగి నియామకం చేపట్టలేదు. ఒక్క అధికారే అన్నీ తానై చేయాల్సిన పరిస్థితి నెలకొంది. మన్యంలోని వెంకటాపురం, వాజేడు మండలాల పరిధిలో నాలుగు విద్యుత్తు ఉప కేంద్రాలున్నాయి. రెండు సెక్షన్లుగా విభజించిన అధికారులు 15 ఫీడర్ల పరిధిలో విద్యుత్తును సరఫరా చేస్తున్నారు. 190 కి.మీ పరిధిలో 11కేవీ, 70 కి.మీ పరిధిలో 33కేవీ లైన్ విస్తరించి ఉంది. 15కేవీ నుంచి 100 కేవీ సామర్థ్యం కలిగిన 753 నియంత్రికలను ఏర్పాటు చేశారు. 18,450గృహం, 3,010 వ్యవసాయం, కేటగిరి–2 కింద 1,250, పరిశ్రమలకింద 40విద్యుత్తు కనెక్షన్ల ద్వారా కరెంటు సరఫరా అందుతోంది. ఎల్‌టీ, 6.3కేవీ లైన్ సైతం పెద్దఎత్తున్నే ఏర్పాటు చేశారు.

# ఇదా ఆకర్షణీయ నగరం!



**హనుమకొండ,తెలంగాణ దిశ:** ఎటు చూసినా ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తాచెదారంతో పరిసరాలన్నీ దుర్గంధంగా మారాయి. కొన్ని రోజులయితే ఈప్రాంతమంతా డంపింగ్ యార్డ్‌గా మారే అవకాశం ఉందని, నిత్యం దుర్గంధంతో ఇబ్బందులు పడుతున్నట్లు స్థానిక కాలనీవాసులు పేర్కొన్నారు. నగరంలోని 66 డివిజన్లలో పారిశుద్ధ్యం పనులు అస్తవ్యస్తంగా ఉన్నాయి. క్షేత్రస్థాయిలో పారిశుద్ధ్యం పనులపై పర్యవేక్షణ కరవైంది. మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే సమీక్ష సమావేశాలతో సరిపెడుతున్నారు. ప్రజారోగ్య విభాగానికి చెందిన ఇద్దరు అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టడం లేదనే విమర్శలున్నాయి. గతంలో వారానికి రెండుసార్లు డివిజన్లలో ఆకస్మిక తనిఖీలు చేసేవారు. కొన్ని నెలలుగా తనిఖీల్లేక పోవడంతో కొందరు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, జవాన్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. అడిగే వారు లేకపోవడంతో ప్రతిరోజూ 450– 500 మంది కార్మికులు పని చేయకుండానే జీతం పొందుతున్నారు. నెలవారీ మామూళ్లు అందుతుండటంతో పని చేయకున్నా జీతాలు ఇచ్చేందుకు సిఫార్సు చేస్తున్నారు. ఒప్పంద కార్మికులు 2650,. 452 తాత్కాలిక కార్మికులున్నా.. పారిశుద్ధ్యం పనులు దయనీయంగా ఉన్నాయి.' నగరంలోని 66 డివిజన్లలో చాలా మంది కార్మికులు పనికి రావడం లేదు. ఉదయం, మధ్యాహ్నం హాజరు వేసి ఇంటికెళ్తున్నారు. నెలకోసారి కూడా కాలనీల్లో మురుగు కాలువలు తీయడం లేదు. కాలనీవాసుల ఫిర్యాదులు పట్టించుకోవడం లేదు. ప్రధాన, అంతర్గత రహదారుల్లో రోజూ చెత్తను తరలించడం లేదు. డివిజన్లలోని పలు కూడళ్లలో రెండు రోజులకోసారి తీసుకెళ్తున్నారు. ఇంటింటా చెత్త సేకరణ రోజూ జరగడం లేదు. దీంతో ఇళ్లలో పోగవుతున్న చెత్తను వీధుల్లో, కాలువల్లో పడేస్తున్నారు. స్వచ్ఛ ఆటోలు మూడు, నాలుగు ట్రిప్పులు వేయాలి. ఒకటి లేదా రెండింటితో సరిపెడుతున్నారు. చెత్తను తరలించే ట్రాక్టర్లు రెండేసి ట్రిప్పులు పూర్తి సామర్థ్యంతో వెళ్లాలి. ఒకటే ట్రిప్పు లేదా, తక్కువ చెత్తతో వెళ్తున్నాయి. మురుగు కాలువల శుభ్రం చేసేందుకు కార్మికులకు కాలనీలు కేటాయించాలి. ఇంటింటా చెత్త సేకరణను ఆకస్మికంగా తనిఖీలు చేయాలి. చెత్తను తరలించే వాహనాలకు జీపీఆర్ఎస్ సిస్టమ్(వెహికల్ ట్రాకింగ్) ఏర్పాటు చేయాలి. మేయర్, కమిషనర్, అధికారులు నిరంతరం డివిజన్లలో ఆకస్మిక తనిఖీలు చేపట్టాలి. 66 డివిజన్ల వారీగా పారిశుద్ధ్యం పనులకు పక్కా ప్రణాళిక ఉండాలి. కాజీపేట, హనుమకొండ ప్రాంతాల్లో ఏ కాలనీకెళ్లినా మురుగు కాలువల నిండా వ్యర్థాలు, రహదారుల్లో చూస్తే చెత్త కనిపిస్తుంది. నగరంలో పారిశుద్ధ్యం పనులు అధ్వానంగా ఉన్నాయి. పనిచేయని ఉద్యోగులను బదిలీ చేయండి.

# కదలని ధాన్యం! అన్నదాత దైన్యం?



**వరంగల్,తెలంగాణ దిశ:** జిల్లాలోని రైతులను నష్టాలు వెంటాడుతున్నాయి. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి.. ఎంతో శ్రమించి పండించిన పంటలకు చి'వరి'కి ఫలితం లేకుండా పోతోంది. చేతికందే సమయంలో ఓవైపు వర్షాలు పంటలను నాశనం చేస్తుంటే.. మరో వైపు అధికారులు కొను గోలు కేంద్రాలను ఏర్పాటు చేయకుండా జాప్యం చేస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు జనగామ, వరంగల్, హనుమకొండ, భూపాలపల్లి జిల్లాల్లోని పలు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిపోయింది. చాలాచోట్ల పక్షం రోజుల క్రితమే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినా ధాన్యం కేటాయింపులపై ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకోకపోవడంతో జాప్యం నెలకొంటోందని తెలిసింది. జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి, పర్వతగిరి లాంటి ప్రాంతాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు కేంద్రాలను ప్రారంభిస్తున్నారే తప్ప.. కాంటాలు వేయట్లేదని రైతులు ఆరోపిస్తున్నారు. మరోవైపు రెండు రోజులుగా అక్కడక్కడా వర్షాలు కురుస్తుండటంతో ధాన్యం తడిసిపోతోంది. తిరిగి ఆరబెట్టడానికి రైతులు నానా కష్టాలు పడుతున్నారు. తడిసిన వరి ధాన్యాన్ని ఆరబోస్తున్న ఈ రైతు పేరు రేణుకుంట్ల పవన్.. భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం చైన్‌పాకకు చెందిన ఈయన రాఘవరెడ్డిపేట శివారులో రెండెకరాల పొలం కౌలుకు తీసుకొని సన్నాల సాగు చేశారు. కురిసిన వర్షానికి ధాన్యం తడిసింది. కొనుగోలు కేంద్రం ఉంటే సకాలంలోనే విక్రయించే వాడిననివాపోయారు. కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు వేసిన ధాన్యాన్ని మిల్లులకు కేటాయించే విషయంపై ప్రభుత్వం నిర్ణయం వెల్లడించాల్సి ఉంది. గతంలో కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్) చెల్లింపుల విషయంలో బ్లాక్ లిస్టులో ఉన్న మిల్లులకు బ్యాంకు గ్యారంటీలతో ధాన్యాన్ని కేటాయించాలని.. సీఎంఆర్ సకాలంలో చెల్లించే మిల్లుల విషయంలో బ్యాంక్ గ్యారంటీలకు మినహాయింపులు ఇవ్వాలని ప్రాథమికంగా నిర్ణయించినా ఈ విషయంపై మరింత స్పష్టత కోసం పలు జిల్లాల ఉన్నతాధికారులు ఎదురుచూస్తున్నారు. దీంతో కొన్నిచోట్ల కాంటాలు వేసిన ధాన్యాన్ని ప్రభుత్వ గోదాములకు తరలిస్తున్నారు.

# యాలకులను తిని గోరు వెచ్చని నీళ్లను తాగండి..

## రెండు పూటలా ఇలా చేస్తే ఎంతో మేలు జరుగుతుంది..



యాలకులనిమనం ఎంతో పూర్వకాలంనుంచే వంట ఇంటి మసాలా దినుసుగా ఉపయోగిస్తున్నాం. యాలకులను వేస్తే వంటకాలకు చక్కని రుచి, వాసన వస్తాయి. ఎక్కువగా మసాలా వంటల్లో యాలకులను వేస్తుంటారు. అయితే ఆయుర్వేద ప్రకారం యాలకులు ఎన్నో అద్భుతమైన ఔషధ గుణాలను కలిగి ఉంటాయి. యాలకుల్లో అనేక సమ్మేళనాలు ఉంటాయి.ఇవి మనల్నిఆరోగ్యంగాఉంచుతాయి. రోగాల నుంచి రక్షిస్తాయి. యాలకులను ఆహారంలో భాగం చేసుకుంటే అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. యాలకుల్లో యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలు ఉంటాయి. కనుక యాలకులను రోజూ తింటుంటే వాపులు, నొప్పులు తగ్గుతాయి. ముఖ్యంగా ఆర్థరైటిస్ నొప్పుల నుంచి ఉపశమనం లభిస్తుంది. కీళ్లు, మోకాళ్ల నొప్పులు ఉన్నవారికి ఎంతో మేలు జరుగుతుంది.

**జీర్ణ సమస్యలకు..:** రోజూ భోజనం చేసిన అనంతరం రెండు పూటలా ఒక యాలక్కాయను తిని ఒక గ్లాస్ గోరు వెచ్చని నీళ్లను తాగుతుండాలి. దీంతో జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. జీర్ణ క్రియ సాఫీగా జరుగుతుంది. పొట్టలో గ్యాస్ ఏర్పడదు. కడుపు ఉబ్బరం, అసిడిటీ నుంచి ఉపశమనం లభిస్తుంది. అలాగే మలబద్దకం కూడా తగ్గుతుంది. పేగుల్లో ఉండే వ్యర్థాలు సులభంగా బయటకు పోతాయి. జీర్ణ వ్యవస్థ శుభ్రంగా మారుతుంది. యాలకులను తిని గోరు వెచ్చని నీళ్లను తాగితే గొంతు, ఊపిరితిత్తుల్లో ఉండే కఫం పోతుంది. దగ్గు, జలుబు, ఆస్తమా వంటి శ్వాసకోశ సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. శ్వాస మార్గాల్లో ఉండే అడ్డంకులు పోతాయి. శ్వాస సరిగ్గా ఆడుతుంది.

**గాఢ నిద్రకు..:** యాలకుల్లో ఒత్తిడిని తగ్గించే సమ్మేళనాలు ఉంటాయి. యాలకులను రోజూ తింటే ఒత్తిడి, ఆందోళన తగ్గుతాయి. మైండ్ రిలాక్స్ అవుతుంది. మానసిక ప్రశాంతత లభిస్తుంది. రాత్రి పూట చక్కగా నిద్ర పడుతుంది. పడుకున్న వెంటనే గాఢ నిద్రలోకి జారుకుంటారు. నిద్రలేమి నుంచి బయట పడవచ్చు. యాలకుల్లో డై యురెటిక్ గుణాలు ఉంటాయి. అందువల్ల యాలకులను తింటే శరీరంలోని వ్యర్థాలు, టాక్సిన్లు బయటకు పోయి శరీరం అంతర్గతంగా శుభ్రంగా మారుతుంది. శరీరం డిటాక్స్ అవుతుంది. రోగాల నుంచి రక్షణ లభిస్తుంది. యాలకుల్లో యాంటీ మైక్రోబియల్ గుణాలు ఉంటాయి. ఇవి నోట్లో ఉండే బ్యాక్టీరియాను నిర్మూలిస్తాయి. దీంతో నోటి దుర్వాసన తగ్గుతుంది. దంతాలు, చిగుళ్లు దృఢంగా, ఆరోగ్యంగా ఉంటాయి. చిగుళ్ల నుంచి రక్తం కారే సమస్య తగ్గుతుంది.

**క్యాన్సర్ రాకుండా అడ్డుకోవచ్చు..:**
యాలకుల్లో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి ఫ్రీ ర్యాడికల్స్ వల్ల మన శరీరానికి కలిగే నష్టాన్ని నివారిస్తాయి. దీంతో కణాలు సురక్షితంగా ఉంటాయి. ఫలితంగా క్యాన్సర్ రాకుండా అడ్డుకోవచ్చు. గుండె పోటు రాకుండా రక్షిస్తాయి. అధిక బరువు ఉన్నవారు రోజూ యాలకులను తిని నీళ్లను సేవిస్తుంటే ఫలితం ఉంటుంది. శరీర మెటబాలిజం పెరుగు తుంది. క్యాలరీలు ఖర్చయి కొవ్వు కరుగుతుంది. బరువు నియంత్రణ లో ఉంటుంది. గుండె ఆరోగ్యానికి యాలకులు ఎంతో మేలు చేస్తాయి. వీటిని రోజూ తింటే రక్త సరఫరా మెరుగు పడుతుంది. ఇది బీపీని తగ్గిస్తుంది. హైబీపీ ఉన్నవారికి ఎంతో మేలు జరుగుతుం ది. ఇలా యాలకులను తినడం వల్ల అనేక లాభాలను పొందవచ్చు. రోజూ ఉదయం, సాయంత్రం తింటే ఎక్కువ ఫలితం ఉంటుంది.

## రోజూ ఒక గ్లాస్ మజ్జిగను సేవిస్తే..

# ఇన్ని లాభాలు కలుగుతాయా..?



సాధారణంగా చాలా మంది పెరుగును ఇష్టంగా తింటుంటారు. కానీ మజ్జిగను మాత్రం తీసుకోరు. అందులో నీటి శాతం అధికంగా ఉంటుందని చెప్పి మజ్జిగను సేవించేందుకు అంతగా ఇష్టపడరు. అయితే పెరుగు కన్నా మజ్జిగనే ఎక్కువ ఆరోగ్యకరమైందని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. మన శరీరంలోని వేడిని తగ్గించేందుకు రెండూ ఉపయోగకరమైనవే. కానీ మజ్జిగలో కొవ్వు శాతం చాలా తక్కువగా ఉంటుంది. కనుక ఇది మనకు ఇంకా ఎక్కువ మేలు చేస్తుందని అంటున్నారు. ఇక వేసవి కాలంలో రోజూ ఒక గ్లాస్ మజ్జిగను మధ్యాహ్నం సమయంలో తాగితే ఎంతో మేలు జరుగుతుం ది. మజ్జిగ మనకు అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. మజ్జిగను రోజూ సేవించడం వల్ల అనేక పోషకాలు లభిస్తాయి. మజ్జిగ ప్రొ బయోటిక్ ఆహారాల జాబితాకు చెందినది. అందువల్ల మజ్జిగను రోజూ తాగితే జీర్ణ వ్యవస్థలో మంచి బ్యాక్టీరియా పెరుగుతుంది. ఇది జీర్ణక్రియను మెరుగు పరుస్తుంది. తిన్న ఆహారం సరిగ్గా జీర్ణంఅయ్యేలా చేస్తుంది.కడుపుఉబ్బరం, అసిడిటీ, గ్యాససమస్యల నుంచి ఉపశమనంలభిస్తుంది.మలబద్దకం తగ్గుతుంది. మజ్జిగలోక్యాల్షియం సమృద్ధిగాఉంటుంది.అందువల్ల మజ్జిగను రోజూ సేవిస్తే ఎముకలు, దంతాలు దృఢంగా, ఆరోగ్యంగా ఉంటాయి. మజ్జిగలో లాక్టిక్ యాసిడ్ఉంటుంది.ఇది శరీర రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. దీంతో శరీరం రోగాలు, ఇన్ఫెక్షన్లకు వ్యతిరేకంగా పోరాటం చేస్తుంది. వ్యాధుల నుంచి రక్షణను అందిస్తుంది.

**బరువు తగ్గేందుకు..:** అధిక బరువు తగ్గాలని చూస్తున్నవారికి మజ్జిగ మంచి ఆహారం అని చెప్పవచ్చు. మజ్జిగలో ప్రోటీన్లు ఎక్కువగా, కొవ్వు తక్కువగా ఉంటాయి. పెరుగుతో పోలిస్తే మజ్జిగలో కొవ్వు చాలా తక్కువగా ఉంటుంది. అందువల్ల బరువు తగ్గాలనుకునే వారికి మంచి ఆహారం అని చెప్పవచ్చు. దీన్ని తాగితే ఎక్కువ సేపు ఉన్నా కడుపు నిండిన భావనతో ఉంటారు. ఆకలి వేయదు. దీంతో ఆహార్ తక్కువగా తింటారు. ఇది బరువు తగ్గేందుకు సహాయం చేస్తుంది. మజ్జిగను తాగడం వల్ల వేసవిలో శరీరం కోల్పోయిన ఎలక్ట్రోలైట్స్ను తిరిగి పొందవచ్చు. దీంతో వేసవి తాపం నుంచి ఉపశమనం లభిస్తుంది. శరీరం డీహైడ్రేషన్ బారిన పడకుండా ఉంటుంది. ఎండ దెబ్బ నుంచి సురక్షితంగా ఉండవచ్చు. మజ్జిగలో అనేక ప్రోటీన్లు, యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి కొలెస్ట్రాల్ లెవల్స్ను తగ్గిస్తాయి. దీని వల్ల గుండె ఆరోగ్యంగా ఉంటుంది. మజ్జిగలో ఉండే బయోయాక్టివ్ సమ్మేళనాలు శరీరంలో రక్త సరఫరాను మెరుగు పరుస్తాయి. దీంతో బీపీ తగ్గుతుం ది. హైబీపీ ఉన్నవారు మజ్జిగను సేవిస్తుంటే ప్రయోజనం ఉంటుంది. దీంతో గుండె కూడా ఆరోగ్యంగా ఉంటుంది. గుండె పోటు రాకుండా నివారించవచ్చు. మజ్జిగలో ఉండే రైబోఫ్లేవిన్ లివర్ పనితీరును మెరుగు పరుస్తుంది. దీంతో లివర్లో ఉండు వ్యర్థాలు, టాక్సిన్లు బయటకు పోతాయి. లివర్ ఆరోగ్యంగా ఉంటుంది. ఫ్యాటీ లివర్ సమస్య ఉన్నవారు రోజూ మజ్జిగను సేవిస్తుంటే ఫలితం ఉంటుంది. చర్మ సంరక్షణకు కూడా మజ్జిగ మేలు చేస్తుంది. మజ్జిగను సేవిస్తుంటే డ్యామేజ్ అయిన చర్మ కణాలు మరమ్మత్తులకు గురవుతాయి. దీంతో చర్మం కాంతివంతంగా మారి మృదువుగా ఉంటుంది.

# రాజకీయాల్లోకి ఏబీవీ..!

**రాజమండ్రి,తెలంగాణ దిశ:** ఏపీ మాజీ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు సంచలన ప్రకటన చేశారు. తాను రాజకీయాల్లోకి ఎంట్రీ ఇవ్వాలని నిర్ణయించుకున్నట్లు మనసులోని మాట బయటపెట్టారు. రాజకీయాల్లోకి రావాలని అనిపించిందని, అందుకే రాజకీయాల్లోకి వస్తున్నట్లు వెల్లడించారు. మెరుగైన సమాజం కోసం పాటు పడేందుకే వస్తున్నట్లు తెలిపారు. అంతేకానీ పదవులు ఆశించి మాత్రం కాదన్నారు.మాజీ సీఎం జగన్తో తనకు ఎలాంటి విభేదాలు, వ్యక్తిగత కక్షలు అస్సలు లేవన్నది ఆయన మాట. జగన్ అక్రమాలను కచ్చితంగా బయటకు తెస్తానని కుండబద్దలు కొట్టేశారు. కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం కోడికత్తి శ్రీను కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా మీడియాతో మాజీ ఐపీఎస్ అధికారి మాట్లాడారు. ఊహించలేని విధంగా విధ్వంసం జరిగిందన్నారు. గడిచిన ఐదేళ్లు ఊహించని డ్యామేజ్ జరిగిందన్నారు.జగన్ పార్టీ, పునాదులు నేరాలు, హత్యలు, అవినీతి, అరాచకం,అణిచివేత పునాదులపై నిర్మించారన్నారు. రాజకీయాలంటే కేవలం సంపాదన, అడ్డు వచ్చినవారిని అణిచివేయడమేన్నారు. ప్రజల గురించి ఆయనకు ఏమాత్రం పట్టలేదన్నారు. వయస్సు వచ్చిన దగ్గర నుంచి రాజకీయాల్లోకి వచ్చిన వరకు ఆయన చేసిన పనులన్నీ ఇవేనన్నారు.ఆయనలాంటి మనసత్వం ఉన్నవారిని, సభ్యత సంస్కారం లేని వారిని పెంచి పోషిస్తారని, అలాంటి వారికే ప్రమోషన్లు సైతం ఇస్తున్నారని అన్నారు. ప్రతిపక్ష నేతలు ఇళ్లు, ఆఫీసులపై దాడి చేసిన వారికి మాత్రమే ప్రమోషన్ ఆయన ఇస్తారని గుర్తు చేశారు. ప్రజాలను కుల, మత వర్గాలుగా విభజించి తన దోపిడీని సాగించాలనే ఆలోచనున్న వ్యక్తిని అన్నారు. ఆయన్ని అనుసరిస్తే సమాజం ఎటువైపు వెళ్తుందో ఊహించలేమన్నారు. జగన్ అధికారంలోకి రాకముందు బలైన వ్యక్తి కోడి కత్తి



శ్రీను అని చెప్పారు ఏబీవీ. దళిత యువకుడి జీవితాన్ని చిదిమేసిన వ్యక్తి జగన అని అన్నారు. ఆ కేసుకు సంబంధించి ముఖ్యమైన పత్రాలు ఆయన మీడియాకు అందజేశారు. కోడికత్తి శ్రీను వ్యవహారం మాత్రమే కాదని, ఎన్నో విషయాల్లో ఆయన స్వభావం బయటపెట్టుకున్నారని వివరించారు. సమయం వచ్చినప్పుడు ప్రజలు, మీడియా ముందు చెబుతానని వెల్లడించారు. ఆయన మాటల వ్యవహారశైలిని గమనించినవాళ్లు మాత్రం అయితే జనసేన, లేకుంటే బీజేపీలో చేరడం ఖాయమని అంటున్నారు. 2014-19 మధ్యకాలంలో అప్పటి చంద్రబాబు ప్రభుత్వానికి ఇంటెలిజెన్స్ చీఫ్గా వ్యవహరించారు ఏబీ వెంకటేశ్వరరావు. అయితే జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అనేక ఆరోపణలతో ఆయన్ని సస్పెండ్ చేసింది. గడిచిన ఐదేళ్లు జగన్ ప్రభుత్వంపై పోరాటం చేశారు ఆయన. పదవీ విరమణకు ముందు ఉదయం డ్యూటీలో జాయిన్ అయి సాయంత్రం రిటైర్ తీసుకున్నారు.

# 6 లైన్ రోడ్డుగా నేషనల్ హైవే 65



**విజయవాడ,తెలంగాణ దిశ:** హార్బర్లను నేషనల్ హైవేలకు అనుసంధానం చేయాలనే ప్రతిపాదనలు ఇటీవల తెరపైకి వచ్చాయి. దీంట్లో భాగంగా..విజయవాడ- మచిలీపట్నం జాతీయ రహదారిని విస్తరించను న్నారు. దీంతో ఈ మార్గంలో ఉన్న ప్రాంతాలు మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉంది. విజయవాడ- మచిలీపట్నం నేషనల్ హైవే 65ని ఆరు వరుసలుగా విస్తరించేందుకు.. ఎన్హెచ్ఏఐ కార్యాచరణ ప్రారంభించింది. జాతీయ రహదారులను నౌకాశ్రయాలకు అనుసంధానం చేసే ప్రాజెక్టులో భాగంగా.. ఈ రహదారిని మచిలీపట్నం పోర్టు వరకూ విస్తరిస్తారు. ఇందుకోసం సమగ్ర ప్రాజెక్టు నివేదికను సిద్ధం చేస్తున్నారు. విజయవాడ నుంచి మచిలీపట్నం వరకు జాతీయ రహదారి 63 కిలో మీటర్ల మేర ఉంది. దీంట్లో అమరావతి ఔటర్ రింగ్ రోడ్డు కంకిపాడు- ఉయ్యూరు మధ్య చలివేంద్రపాలెం సమీపంలో క్రాస్ అవుతుంది. 2. చలివేంద్రపాలెం నుంచి మచిలీపట్నం వరకు 44 కిలోమీటర్ల మేర ప్రస్తుతమున్న 4 వరుసల రోడ్డును ఆరు వరుసలుగా విస్తరిస్తారు. మచిలీపట్నం సమీపంలో ఒంగోలు- కత్తిపూడి జాతీయ రహదారి రెండు వరుసలుతో ఉంది. దీన్ని మాచవరం రైస్మిల్లు వరకు 4 కిలోమీటర్లు నాలుగు వరుసలుగా విస్తరిస్తారు.మాచవరం రైస్ మిల్లు వద్ద నుంచి పోర్టుకు 3.7 కిలోమీటర్లను నాలుగు వరుసలతో కొత్తగా రహదారిని నిర్మిస్తారు. వీటిలో ఆరు వరుసలుగా విస్తరించనున్న 44 కి.మీలతోపాటు 3.7 కి.మీ. మేర నాలుగు వరుసల హైవే నిర్మాణాన్ని ఎన్హెచ్ఏఐ చేపడుతుంది.ఒంగోలు- కత్తిపూడి హైవేలో 4 కిలోమీటర్ల మేర విస్తరించే పనులను కేంద్ర రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వశాఖ (మోర్త్) పర్యవేక్షిస్తుంది. ఈ రహదారికి చెందిన డీపీఆర్ తయారీ బాధ్యత చైతన్య, ఎంఎస్ పార్క్ జేవీ సంస్థకు అప్పగించారు.విజయవాడ నుంచి మచిలీపట్నం వరకు ఉన్న హైవేలో.. ఓఆర్ఆర్ క్రాస్ అయ్యే ప్రాంతం నుంచి మాత్రమే రహదారిని విస్తరించనున్నారు..విజయవాడలోని బెంజ్ సర్కిల్ నుంచి పోరంకి, పెనమలూరు కూడలి, కంకిపాడు మీదుగా చలివేంద్రపాలెం వరకు 19 కిలోమీటర్ల మేర ఉన్న మార్గాన్ని ఆరు వరుసలుగా విస్తరించడంపై ఇంకా స్పష్టత లేదు.విజయవాడ నగర పరిధిలో వాహన రద్దీ ఈ పరిధిలోనే ఎక్కువగా ఉంటుంది. హైవే నుంచి పోర్టు కనెక్టివిటీకి ఎన్హెచ్ఏఐ ప్రాధాన్యం ఇస్తోంది.

ఇందులో భాగంగా ఓఆర్ఆర్ క్రాస్ అయ్యే ప్రాంతం నుంచే పోర్టుకు అనుసంధానంపై ప్రస్తుతం దృష్టిపెట్టినట్టు అధికారులు చెబుతున్నారు.హైవే విస్తరణతో రోడ్డు వెడల్పు అవుతుంది. దీనివల్ల ట్రాఫిక్ సాఫీగా సాగుతుంది. వాహనాల రాకపోకలు సులువుగా ఉండటం వల్ల ప్రయాణ సమయం తగ్గుతుంది.విజయవాడ - మచిలీపట్నం మధ్య వాణిజ్య సంబంధాలు మెరుగుపడతాయి. సరుకు రవాణా సులువుగా, త్వరగా జరుగుతుంది ఇది వ్యాపారాలకు లాభదాయకం.మచిలీపట్నం సమీపంలోని మంగినపూడి బీచ్ వంటి పర్యాటక ప్రాంతాలకు వెళ్లడం సులభమవుతుంది. మంచి రోడ్డు సౌకర్యం పర్యాటకులను ఆకర్షిస్తుంది.

# అమరావతిలో మళ్లీ భూ సేకరణ..!



**అమరావతి,తెలంగాణ దిశ:** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక.. రాజధాని అమరావతి పనులు పునః ప్రారంభం అయ్యాయి. కీలక పనులకు టెండర్లను పిలవడానికి సీఆర్డీఏ అధికారులు కసరత్తు చేస్తున్నారు. అటు కేంద్రం సహకారం, ఇటు బ్యాంకుల రుణాలు, మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం భారీగా నిధులు కేటాయిస్తోంది. ఈ నేపథ్యంలో చంద్రబాబు ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. అమరావతి విస్తరణకు మరో 30 ఎకరాలు సేకరించాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు సమాచారం. జధాని అమరావతి రైతులపై మరో పిడుగు పడింది. ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణం కోసం మరో ముప్ఫయి వేల ఎకరాలను సేకరించాలని నిర్ణయించింది. కోర్ కాపిటల్ బయట మరో ముప్ఫయివేల ఎకరాలను భూమిని సేకరించాలని భావిస్తుంది. రాజధాని భవిష్యత్ అవసరాల కోసం ఈ ముప్ఫయి వేల ఎకరాలను సేకరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయించినట్లు తెలిసింది. ప్రస్తుతమున్న భూములకు అదనంగా మరో ముప్ఫయి వేల ఎకరాల సేకరణ లక్ష్యంగా పెట్టుకున్న ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేస్తుంది.రాజధాని అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు, అవుటర్ రింగ్ రోడ్డు, విమానాశ్రయం, రైల్వే లైన్, పారిశ్రామిక సంస్థల కోసం ఈ ముప్ఫయివేల ఎకరాలను సేకరించాలని నిర్ణయించినట్లు తెలిసింది. ఇందుకోసం రైతులను ఒప్పించి ముప్ఫయి వేల ఎకరాలను సేకరించాలని అధికారులను ఆదేశించినట్లు సమాచారం. ఇప్పటికే రాజధాని రైతులు 29 గ్రామాల పరిధిలో 32 వేల ఎకరాలను ప్రభుత్వానికి ఇచ్చారు. అందులో మొదటి దశ నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే ఈ పనుల కోసం టెండర్లను పిలిచి ఖరారు చేశారు.

.1.అమరావతి విస్తరణ కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అదనంగా 30 వేల ఎకరాలను సేకరించాలని యోచిస్తోంది. ఇది అంతర్జాతీయ విమానాశ్రయం, రింగ్ రోడ్లు వంటి భవిష్యత్ ప్రాజెక్టులకు తోడ్పడుతు ంది. రాజధాని చుట్టూ భూ సేకరణపై సీఆర్డీఏ కసరత్తు చేస్తోంది.

2.అమరావతి కోర్ క్యాపిటల్ వెలుపల ఉన్న 20కి పైగా గ్రామాల్లో ఈ భూసేకరణ చేపట్టే అవకాశం ఉంది. ప్రస్తుతం దీనికి సంబంధించి న సాధ్యాసాధ్యాలను అధికారులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు.

3.అమరావతిలో అంతర్జాతీయ విమానాశ్రయం ఏర్పాటుకు టెక్నో-ఫీజిబిలిటీ నివేదిక కోసం ప్రభుత్వం టెండర్ల ఆహ్వానించింది. సాంకేతిక నివేదికను త్వరగా రూపొందించి కేంద్ర పౌర విమానయాన శాఖకు పంపనున్నారు. కేంద్రం నుంచి అనుమతి వచ్చాక తదుపరి చర్యలు తీసుకోనున్నారు. ఎయిర్పోర్ట్ కోసం కొత్త సేకరించే భూమిలో స్థలాన్ని కేటాయించే అవకాశం ఉంది. 4.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమరావతిలో ప్రపంచ స్థాయి రైల్వే స్టేషన్ను నిర్మించాలని యోచిస్తోంది. ఇది దేశంలోనే అతిపెద్ద రైల్వే స్టేషన్లలో ఒకటిగా ఉంటుందని చెబుతున్నారు. దాదాపు 1500 ఎకరాల్లో దీన్నినిర్మించే అవకాశం ఉంది. భవిష్యత్తు అవసరాల కోసం దీనికి అదనంగా భూమిని కేటాయించే అవకాశం ఉంది. 5.రాజధాని అమరావతిలో ఇప్పటికే ప్రముఖ విద్యాసంస్థలు ఉన్నాయి. భవిష్యత్తులో మరిన్నింటిని స్థాపించే అవకాశం ఉంది. వాటి స్థాపనకు ఇబ్బంది లేకుండా భూసేకరణ చేసి ఉంచాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు తెలుస్తోంది.

6.అమరావతి ప్రాంతంలో పరిశ్రమల ఏర్పాటు కోసం రాయితీ ధరలకు భూమిని కేటాయించే అవకాశం ఉంది. ఇందుకోసం ప్రస్తుతం ప్రభుత్వం ఆధీనంలో ఉన్న భూమిని కాకుండా.. కొత్తగా సేకరించిన దాంట్లో ఇవ్వాలని సర్కారు యోచిస్తున్నట్టు సమాచారం.

7.రాష్ట్ర ప్రభుత్వం కూడా అమరావతిలో కొన్ని కొత్త నిర్మాణాలు చేపట్టాలని భావిస్తోంది. అందుకోసం చాలా భూమి అవసరం. అందుకే కొత్తగా భూసేకరణ చేపట్టనున్నట్టు తెలుస్తోంది.

8.అమరావతిని ఒక ఐటీ హబ్గా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అనేక ఐటీ, ఎలక్ట్రానిక్స్ కంపెనీలకు ఇక్కడ అవకాశాలు ఉన్నాయి. వాటికి కూడా భూమి కొరత లేకుండా ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకుంటోంది.

9.కొన్ని నివేదికల ప్రకారం.. అమరావతిలో భూముల ధరలు పెరుగుతున్నాయి. పెట్టుబడిదారులు మళ్లీ ఆసక్తి చూపుతున్నారు. రాబోయే కొద్ది సంవత్సరాలలో ఇక్కడ మరిన్ని కంపెనీలు తమ కార్యకలాపాలను ప్రారంభించే అవకాశం ఉంది.

ప్రధాని నరేంద్ర మోదీ శంకుస్థాపన చేసిన తర్వాత పనులు వేగం అందుకున్నాయి. అయితే ప్రస్తుతం ఉన్న 32 ఎకరాలు సరిపోదని భావించిన చంద్రబాబు నాయుడు ప్రభుత్వం కోర్ కాపిటల్ బయట వైపు మరో ముప్ఫయి వేల ఎకరాలను సేకరించేందుకు సిద్ధమయింది. దీంతో రైతుల గుండెల్లో పిడుగు పడినట్లయింది. రైతులను ఒప్పించే బాధ్యత ప్రస్తుతానికి అధికారులపై ఉంచారు. వారికి నచ్చ చెప్పి రాజధాని అమరావతి ప్రాంతంలో ప్లాట్లు ఇస్తామని చెప్పడంతో పాటు రాజధాని అభివృద్ధికి సహకరించాలని కోరనున్నారు. మరి రైతులు ఏ మేరకు సహకరిస్తారన్నది చూడాల్సి ఉంది.

## శ్రీశైలం దారిలో

# వన్యప్రాణుల రక్షణ

### వాహనాలపై నిషేధంతో సత్ఫలితాలు

**శ్రీశైలం,తెలంగాణ దిశ:** నల్లమల అటవీ ప్రాంతమైన హైదరాబాద్- శ్రీశైలం జాతీయ రహదారిపై రాత్రివేళ ప్రయాణలను నిషేధించిన తరవాత సత్ఫలితాలు ఇస్తున్నాయని స్థానికులు అంటున్నారు. వాహనాల వేగం నిరోధించాలని అన్నారు. ఇక్కడ వాహనాల వేగం కారణంగా అటవీ జంతువులు వాటి కింద పడి చనిపోవడంతో ఈ చర్య తీసుకున్నారు. దీంతోపాటు రాత్రివేళ ఈ మార్గంలో వాహనాల రాకపోకలపై నిషేధం విధించారు. అటవీ ప్రాంతంలో జాతీయ రహదారిపై వేగంగా వెళుతున్న వాహనాల వల్ల పలు వన్యప్రాణు లు మరణించిన నేపథ్యంలో కొత్తగా వాహనాల వేగనియంత్రణకు చర్యలు తీసుకోవాలని సర్కారు నిర్ణయించింది. ఇటీవల స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థులు, వైద్యులు, ఇంజనీర్లతో జరిపిన వన్యప్రాణుల సర్వేలో వెల్లడైన వాస్తవాలతో ఇకనుంచి వన్యప్రాణుల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని నిర్ణయించింది.దీంతోపాటు రాత్రి 9 గంటలనుంచి ఉదయం 6 గంటల వరకు నల్లమల అటవీ ప్రాం తంగుండవెళ్లే జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలను నిషేధిం చాలని నిర్ణయించారు. అభయారణ్యంలో రోడ్డు ప్రమాదాల బారినుం చి వన్యప్రాణుల పరిరక్షణ కోసం హైదరాబాద్- శ్రీశైలం జాతీయ రహదారిపై వాహనాలు 40 కిలోమీటర్ల వేగం కంటే ఎక్కువగా నడపరాదని తెలంగాణ సర్కారు ఆదేశాలు జారీ చేసింది.

# ట్రంప్ దూకుడుకు చైనా కళ్లెం

## కీలక ఖనిజాల ఎగుమతులు నిలిపివేత



వాషింగ్టన్: అమెరికా- చైనాల మధ్య సుంకాల యుద్ధం కొనసాగుతోంది. ఈ క్రమంలో చైనా కూడా ట్రంప్ తీరుకు ఘాటుగా సమాధానం ఇస్తోంది. ఈక్రమంలో అమెరికాకు అవసరమైన పలు వస్తువులపై నిషేధంవిధించి, ఎగుమతలను నిలిపివేసింది. చైనా ఉత్పత్తులపై టారిఫ్ లను యూఎస్ 145 శాతానికి పెంచినట్లు ఇటీవల అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన విషయం తెలిసిందే. అందుకు ప్రతిగా చైనా కూడా అమెరికా ఉత్పత్తులపై సుంకాలను 125 శాతానికి పెంచుతున్నట్లు ప్రకటించింది. అంతటితో ఆగకుండా తమ దేశంలో లభ్యమయ్యే అరుదైన ఖనిజాలు, కీలకమైలోహాలు, అయస్కాంతా లను యూఎస్‌కు ఎగుమతి చేయడాన్ని ఆపేస్తున్నట్లు బీజింగ్ పేర్కొం ది. ఈ ప్రకటనపై అమెరికా స్పందించింది. ఖనిజాల ఎగుమతి విషయంలో చైనా తీసుకున్న నిర్ణయం ఆందోళనకరంగా ఉందని ట్రంప్ ముఖ్య ఆర్థిక సలహాదారుల్లో ఒకరైన కెవిన్ హసెట్ పేర్కొన్నా రు. టెక్నాలజీ, ఎలక్ట్రానిక్ పరికరాల తయారీ రంగంలో ఈ ఖనిజాల అవసరం ఎక్కువగా ఉందన్నారు. డ్రాగన్‌నిర్ణయం వల్ల పశ్చిమదే శాల్లోఆయుధాలు, ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్స్, ఏరోస్పేస్ తయారీ, సెమీకండక్టర్లు కంపెనీలకు సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉందన్నారు. ఈ అంశాన్ని నిశితంగా పరిశీలిస్తున్నామని.. వీటిపై డ్రాగన్‌తోచర్చలు జరిపే అవకాశం ఉందని తెలిపారు. అయితే ట్రంప్ విధించిన టారిఫ్‌ల వల్ల 100 శాతం మాంద్యం వస్తుందని తామేమీ అనుకోవట్లేదని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉత్పత్తి అవుతున్న అరుదైన ఖనిజాల్లో దాదాపు 90శాతం చైనా నుంచే వెళుతున్నాయి. తాజాగా బీజింగ్ చేపట్టిన చర్యల ప్రభావం కేవలం అమెరికా వరకే పరిమితం కాదు..ఉండనుంది.

తొలుత చైనా ఉత్పత్తులపై టారిఫ్‌లను ట్రంప్ 54శాతం పెంచడంతో కీలక విడిభాగాల ఎగుమతులను చైనా ఆపేసింది. మరోసారి అగ్రరాజ్యంసుకాలను 145 శాతానికి పెంచడంతో అరుదైన ఖనిజాలు, కీలకమైన లోహాలు, అయస్కాంతాలు, ఇతర ఉత్పత్తులను ఎగుమతి చేయడం బీజింగ్ నిలిపివేసింది. దీంతోపాటు- ఎక్స్‌పోర్ట్ లైసెన్స్‌లను పరిమితం చేసే అవకాశాలు కూడా ఉన్నాయి. అమెరికాలోని లాక్‌హీడ్ మార్టిన్,-టె-స్లా, యాపిల్ వంటి సంస్థలు చాలా ముడిపదార్థాల కోసం బీజి ంగ్‌పైనే ఆధారపడుతున్నాయి. అమెరికా ప్రభుత్వం వద్ద రేర్‌ఎర్త్ మినరల్స్ నిల్వలు ఇప్పటికే ఉన్నాయి. కానీ, తమ డిఫెన్స్ కాంట్రాక్టర్లకు సరఫరా చేయడానికి మాత్రం ఇవిసరిపోవు. దీంతో అమెరికా ప్రభుత్వం చైనా చర్యలపై ఆందోళన వ్యక్తంచేస్తోంది.

# వాటర్ ట్యాంక్ పై ఎక్కి ఖాళీ బిందెలతో..

## ఆదివాసి గిరిజన మహిళల ధర్నా



రావికమతం : అనకాపల్లి జిల్లా రావికమతం మండలం చీమలపాడు పంచాయతీ అజయపురం గ్రామంలో 30 కుటుంబాలు గిరిజనులు జీవనం సాగిస్తున్నారు. 2019 సంవత్సరంలో15 ఆర్థిక సంఘం నిధుల నుండి 5 ఐదు లక్షల రూపాయలు ఖర్చుపెట్టి గ్రామానికి కిలోమీటర్ల దూరంలో బోరు తీసి పైపు లైన్ ద్వారా అక్కడనుండి గ్రామానికి నీరు సరఫరా చేసేవారు. ఈ మోటర్ కాలిపోవడంతో నీరు కోసం ఎత్తైన కొండ గడ్డ ఊట బావిని తవ్వి అక్కడి నుండి నీరు తెచ్చుకుంటున్నారు. కిలోమీటర్ నర దూరంలో నీరు తెచ్చుకోవడంతో సమయం అంతా నీటికోసమే ఖర్చు పెడుతున్నారు. 2023 సంవత్సరంలో జల్జీవన్ మిషన్ ద్వారా 15లక్షల రూపాయలు నిధులు మంజూరు చేశారు. వాటర్ ట్యాంకును అధికారులు అసంపూర్తిగా నిర్మాణం చేసి వదిలేశారు. ఇంటింట కుళాయిలు పైపులు వేశారు.

వాటిని కూడామధ్యలో వ దిలేశారు. 2024 డిసెంబర్ మొదటి వారంలో అజరు పురం గ్రామానికి రోడ్డు శంకుస్థాపన చేయడానికి వచ్చిన అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు, స్థానిక శాసనసభ్యులు సీఎం రమేష్ కేఎస్ఎన్ రాజు కి గ్రామస్తులకు క్లియర్ చేయడం జరిగింది. 15 రోజుల్లో పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చాం కానీ నేటికి నాలుగు నెలలు పూర్తవుతున్నప్పటికీ జల్ది వెండిమిషన్ ద్వారా నిర్మాణం చేసిన వాటర్ ట్యాంక్ పండ్లు అసంపూర్తిగా నిలిపివేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాడైపోయిన మోటార్ ను వెంటనే రిపేర్ చేసి. మంచినీరు సరఫరా చేయాలని కోరారు. జల్జీవన్ మిషన్ అసంపూర్తిగా నిర్మాణం చేసిన వాటర్ ట్యాంకును పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమా నికి సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కే గోవిం దరావు. పాంగి జస్వంతి. పాంగి శ్రీరామ. పాంగి చంద్రయ్య గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

# రేర్ ఎర్త్స్ ఎగుమతులపై చైనా పట్టు..

## అమెరికాకు కొత్త సవాళ్లు

ఢిల్లీ: ప్రపంచ వాణిజ్యంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. అమెరికా గతంలో చైనా ఉత్పత్తులపై విధించిన సుంకాలను దృష్టిలో ఉంచుకుని,దానికి ప్రతిగా చైనా వ్యూహాత్మకంగా వ్యవహరించింది. ఏడు కీలకమైన 'రేర్ ఎర్త్' మూలకాల ఎగుమతులపై కొత్తగా నియంత్రణ విధించింది. ఈ మూలకాలు ఆధునిక సాంకేతికత, రక్షణ రంగాలకు అత్యంత కీలకమైనవి కావడంతో అమెరికాకు ఇది కొత్త సవాలుగా మారింది. సమారియంగాడోలినియం,టెర్బియం, డైస్ప్రోసియం, లుటేటియం, స్కాండియం, యిట్రియం వంటి ఖనిజా లు ఈ కొత్త నియంత్రణల పరిధిలోకి వస్తాయి. ఈ కొత్త నిబంధనలు పూర్తిస్థాయి ఎగుమతి నిషేధం కానప్పటికీ, ఇకపై ఈ ఏడు ఖనిజాలను ఎగుమతి చేయాలంటే చైనా ప్రభుత్వం నుంచి ప్రత్యేక లైసెన్స్ పొందాల్సి ఉంటుంది. దీనివల్ల ఎవరికి ఎగుమతి హక్కులు ఇవ్వాలనే దానిపై చైనా అధికారులకు పూర్తి నియంత్రణ లభిస్తుంది. ఈ విధానం అమల్లోకి వస్తే, అమెరికా రక్షణ రంగ కాంట్రాక్టర్ల వంటి కొన్ని కంపెనీలకు ఈ కీలక ఖనిజాల దిగుమతులను నిరాకరించే అవకాశం లేకపోలేదు. వీటికి ప్రత్యామ్నాయాలను కనుగొనడం లేదా ఇతర దేశాల నుంచి పొందడం చాలాకష్టంతో కూడుకున్న పని అని నిపుణులు విశ్లేషిస్తున్నారు. గణా ంకాలను పరిశీలిస్తే, రేర్ ఎర్త్ ఖనిజాల దిగుమతుల కోసం అమెరికా అధికంగా చైనాపైనే ఆధారపడుతున్న విషయం స్పష్టమవుతోంది. 2020 నుంచి 2023 మధ్య కాలంలో అమెరికా దిగుమతి చేసుకున్న మొత్తం రేర్ ఎర్త్‌లో70శాతం చైనా నుంచే వచ్చాయి. మలేషియా, జపాన్, ఎస్టోనియా దేశాలు తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ముఖ్యంగా, కొత్త నియంత్రణల జాబితాలో ఉన్న యిట్రియం కోసం అమెరికా దాదాపుపూర్తిగా చైనాపైనే ఆధారపడి ఉంది. 2020-23 మధ్య అమె రికా దిగుమతి చేసుకున్న యిట్రియం సమ్మేళనాలలో 93 శాతం చైనా నుంచే రావడం



గమనార్హం. యూఎస్ జియోలాజికల్ సర్వే ప్రకారం, యిట్రియం దిగుమతుల కోసం అమెరికా 100 శాతం ఇతర దేశాలపైనే ఆధారపడుతోంది. దీనిని ప్రధానంగా ఉత్ప్రేరకాలు, సిరామిక్స్, ఎలక్ట్రానిక్స్, లేజర్లు, లోహశాస్త్రం, ఫాస్ఫర్‌లలో ఉపయోగిస్తారు. మొత్తం రేర్ ఎర్త్ ఖనిజాల పరంగా చూస్తే, 2024లో అమెరికా నికర దిగుమతులపై 80 శాతం ఆధారపడింది. అంటే, దేశీయ వినియోగంలో 80 శాతం దిగుమతుల (దిగుమతులు మైనస్ ఎగుమతులు) ద్వారానే భర్తీ అయ్యింది.

అయితే, 2020లోఇది 100 శాతంగా, 2021-23 మధ్య 95 శాతానికి పైగా ఉండగా, 2024లో స్వల్పంగా తగ్గింది. దేశీయంగా రేర్ ఎర్త్ సమ్మే ళనాలు, లోహాల ఉత్పత్తిని అమెరికా పెంచడమే ఇందుకు కారణం. అయినప్పటికీ, కీలకమైన కొన్ని మూలకాల కోసం చైనాపై ఆధారప ్డటం తగ్గకపోవడం, తాజా నియంత్రణల నేపథ్యంలో అమెరికాకు వ్యూహాత్మకంగా సవాలుగా మారింది.

# పోషకాహార లోపం వల్ల వచ్చే టైప్-5 డయాబెటిస్

**2.5 కోట్ల మంది దీని బారినపడే అవకాశం**

**%టైప్-5 డయాబెటిస్‌ను అధికారికంగా గుర్తించిన ఐడీఎఫ్**

**రోగ నిర్ధారణ తర్వాత ఏడాదికి మించి బతకడం కష్టమంటున్న నిపుణులు**

**చికిత్సపైనా వైద్యుల్లో అయోమయం**



చాపకింద నీరులా ప్రపంచం మొత్తం పాకేసిన మధుమేహంలో మరో కొత్త రకాన్ని శాస్త్రవేత్తలు గుర్తించారు. ఇంటర్నేషనల్ డయాబెటిస్ ఫెడరేషన్ (ఐడీఎఫ్) టైప్-5డయాబెటిస్‌ను అధికారికంగా గుర్తించింది. ఇది పోషకాహార లోపం వల్ల వచ్చే మధుమేహమని పేర్కొంది. అతి తక్కువ, మధ్యస్థ ఆదాయం కలిగిన దేశాల్లో సన్నగా ఉండేవారు, పోషకాహార లోపంతో బాధపడే యువకుల్లో ఇది వచ్చే అవకాశం ఉందని ఐడీఎఫ్ తెలిపింది. ప్రపంచవ్యాప్తంగా 2 నుంచి రెండున్నర కోట్ల మంది దీని బారిపడే అవకాశం ఉందని పేర్కొంది.

పోషకాహార లోపానికి సంబంధించిన మధుమేహం చారిత్రాత్మకంగా నిర్ధారణ చేయబడిందని హరోల్డ్ అండ్ మురీల్ బ్లాక్ చైర్ పర్సన్ ప్రొఫెసర్ మెరెడిత్ హాకిన్స్ తెలిపారు. ఐడీఎఫ్ దీనిని టైప్-5 డయాబెటిస్‌గా గుర్తించడం వినాశకరమైన ఆరోగ్య సమస్యపై అవగాహన పెంచే దిశగా ఒక ముఖ్యమైన ముందడుగు అని పేర్కొన్నారు. స్థూలకాయం వల్ల వచ్చే మధుమేహాన్ని టైప్-2 డయాబెటిస్ అంటారు. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఇది ఎక్కువగా ఉంది. అయితే, ఆహారం తక్కువగా తీసుకున్నా పోషకాహార లోపం వల్ల కూడా యువకులు డయాబెటిస్ బారిన పడుతున్నారని డాక్టర్ హాకిన్స్ తెలిపారు. ఆసియా, ఆఫ్రికా సహా ప్రపంచవ్యాప్తంగా 2 నుంచి 2.5 కోట్ల మంది ఈ టైప్-5 డయాబెటిస్ బారినపడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ రోగులకు ఎలాంటి చికిత్స అందించాలన్న విషయంలో వైద్యులకు కూడా అంతుబట్టడం లేదన్నారు. రోగ నిర్ధారణ తర్వాత వారు ఏడాదికి మించి జీవించే అవకాశం లేదని పేర్కొన్నారు. పోషకాహార లోపం కారణంగా వచ్చే డయాబెటిస్‌ను 70 ఏళ్ల క్రితమే గుర్తించారు. 1985లో దీనిని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) గుర్తించింది. అయితే, దీనికి సంబంధించిన ఆధారాలు, అధ్యయనాలు లేకపోవడంతో 1999లో దీనిని తొలగించింది.

## దూప దీప నైవేద్యం అర్చకుల కమిటీ సమావేశం

కొడిమ్యాల: కొడిమ్యాల, మల్యాల మండల దూప దీప నైవేద్యం రాష్ట్ర సంఘం, క్రమశిక్షణ సంఘం అధ్యక్షుడు ఓరుగంటి మాధవచార్యులు రూపొందించిన విశ్వవసు సంవత్సరం పంచాంగం అందరికి విస్తరణ చెయ్యడం జరిగింది. రెండుమండలాల కు అడ్‌హాక్ కమిటీ గా ఎన్నుకోబడింది. నెలలో 15రోజులకు ఒకసారి సమావేశ జరుపుకుని సమస్యల పై చర్చించుకుంటామని వారు తెలిపార్రు శెట్టి సత్యనారాయణ, తిరునహరి హరిందర్, కార్యదర్శిగా పంచరత్నాల వెంకటేశ్వర్లు, కోశాధికారిగా దెందుకూరి భాస్కర్, వర్కింగ్ ప్రెసిడెంటుగా తిరునహ రి మధుసుధన్, ప్రచార కారదర్శి గా బండి రవికుమార్, సలహాదా రునిగా వకుల భరణం నర్సయ్య లను ఎన్నికఐనట్లు వారు తెలిపారు.

# విద్వేషం గీసిన విభజన రేఖ...!



ఇది భారతీయ సమాజం.. భిన్న సంస్కృతి, సాంప్రదాయాలు నెలవైన ఇక్కడ అన్ని జాతుల వారు సోదర భావంతో మెలుగుతారు. ఒకరి పడుగలకు ఇంకొకరు అతిథులవుతారు. విందులు, వినోదాలు కలిసి పంచుకుంటారు. కష్టసుఖాల్లో ఒకరికొకరు తోడుగా నిలుస్తారు. ఇట్లాంటి వాతావరణం ఇప్పుడు మారిపోతోంది. మతం పేరుతో ఉన్మాద బీజాలు చాపకింద నీరులా దేశమంతా వ్యాపించేస్తున్నాయి. ఉత్తరాఖండ్‌లో జరిగిన ఓ సంఘటన అందుకు ఉదాహరణ. ఉత్తరాఖండ్, నందానగర్ ప్రాంతం.. నందానదికి ఆనుకుని దేశ రాజధానికి సరిగ్గా 10 గంటల ప్రయాణ దూరంలో ఉంటుంది. చైనా, ఇండియా సరిహద్దు అది. అక్కడ నలిగిపోయిన, మురికిపట్టిన బట్టలను శుభ్రం చేసే డ్రైక్లీనింగ్ షాపును అహ్మద్ హసన్ నిర్వహిస్తున్నాడు. రోజూ ఉదయం 8 గంటలకు షాపు తెరిచి కస్టమర్ల కోసం ఎదురుచూస్తుంటాడు. అయితే ఇంతకుముందులా ఆ షాపుకి ఇప్పుడు ఎవరూ రావడం లేదు. 2024 సెప్టెంబరుకి ముందు, భోజన సమయానికి ఆ షాపులో 20 నుండి 30 మంది వ్యక్తులు వచ్చేవారు. వారిలో హిందువులే ఎక్కువ. వారంతా హసన్‌తో కలిసి కబుర్లు చెప్పేవారు. రాజకీయాలు మాట్లాడేవారు. జోకులు వేసుకునే వారు. కష్టసుఖాలు చర్చించేవారు. అందరూ కలిసి టీ తాగేవారు. కానీ, ఇప్పుడు పట్టుమని ఐదుగురు కూడా ఆ షాపులో లేరు. హసన్ ఇప్పుడు ఆ ప్రాంతంలో నివసిస్తున్న ఒకే ఒక్క ముస్లిం. అంతకుముందు అక్కడ 15 ముస్లిం కుటుంబాలు ఉండేవి. వారి ఇళ్లు, జీవనోపాధి అక్కడే. హసన్ అక్కడే పుట్టి పెరిగాడు. ఉత్తరప్రదేశ్ నుండి వాళ్ల తాత ఇక్కడికి వలసవచ్చిన మొదటి ముస్లిం వ్యక్తి. ఆ తరువాత మరికొన్ని కుటుంబాలు ఇక్కడకి చేరాయి. హిందూ కుటుంబాలతో కలిసి ఈ ముస్లిం కుటుంబాలు పండుగలు జరుపుకునేవి. ఈద్, దీపావళికి ఒకరి ఇంటికి ఒకరు అతిథులుగా వెళ్లేవారు. హిందూ వ్యక్తులు మరణిస్తే అంతిమ సంస్కారాలకి అవసరమయ్యే సామగ్రిని ముస్లిములు సమకూర్చేవారు.

తన స్నేహితుని కుటుంబ వ్యక్తి ఒకరు చనిపోయినప్పుడు అతని శవాన్ని మోసిన వ్యక్తుల్లో హసన్ కూడా ఉన్నాడు. ఇంత సామరస్య వాతావరణం గత ఏడాది సెప్టెంబరు నుంచి ఒక్కసారిగా మారిపోయింది. ముస్లిం వ్యతిరేకత విపరీతంగా పెరిగిపోయింది.

**కోవిడ్ నుండే మొదలైంది!:** అక్కడి పరిస్థితులకు ప్రత్యక్ష సాక్షి అయిన హసన్ వాటిని ఇలా వివరించాడు. 'ఓ హిందూ యువతిని, ముస్లిం వ్యక్తి వేధించాడని ఆరోపణ వచ్చింది. అయితే ఆ ఆరోపణ మొత్తం కమ్యూనిటీకి నెట్టివేశారు. ఈ ద్వేషం ఒక్కసారిగా వచ్చింది కాదు. కోవిడ్ సమయం నుంచి మెజార్టీ ప్రజలు మైనార్టీలపై కోపంగా ఉన్నారు. 'వందలాదిగా ముస్లిం వ్యక్తులు గుమికూడి సమావేశాలు నిర్వహించారని, అందువల్లనే కోవిడ్ వేగంగా పెరిగింద'ని అప్పట్లో కొంతమంది పనికట్టుకుని మరీ ప్రచారం చేశారు. అప్పటి నుంచి వారి మనసుల్లో నాటుకుపోయిన విషం ఈ ఘటనతో ఒక్కసారిగా పైకి వచ్చింది. వాస్తవానికి ఆరోపణలు వచ్చిన తరువాత రోజు ఆ యువతికి మద్దతుగా, ముస్లిం వ్యక్తికి వ్యతిరేకంగా కొంతమంది ర్యాలీ చేశారు. అందులో మేంకూడా పాల్గొన్నాం'అని హసన్ చెప్పాడు.

ఆ రోజు జరిగిన ర్యాలీలో ముందు వరుసలో కొంతమంది వ్యక్తులు అన్సర్ అనే ఓ ముస్లిం వ్యక్తిని చావబాదారు. వేధింపులు చేసిన యువకుడికి సహాయం చేశాడని అతడిని విచక్షణారహితంగా కొట్టారు. అలా చేస్తున్నప్పుడే వారిలో కొంతమంది హిందూ వ్యక్తులు బిగ్గరగా అరుస్తూ ముస్లిం వ్యతిరేక నినాదాలు చేశారు. 'వాళ్లని బూటు కాళ్లతో కొట్టండి.. ఎక్కడ కనిపిస్తే అక్కడ చావబాదండి' అని పిలుపునిచ్చారు. ఒకపక్క నినాదాలు చెబుతుండగానే రాబోయే ప్రమాదాన్ని గ్రహించిన గుంపులో ఉన్న ఇతర ముస్లింలు తలోదిక్కూ పారిపోయారు. వారిలో హసన్ కూడా ఉన్నాడు. తరువాత ఆ గుంపు ముస్లిం ఇళ్లపై దాడి చేసింది. వారి షాపులను ధ్వంసం చేసింది.

ఆ రోజును హసన్ ఇలా గుర్తు చేసుకున్నాడు. 'అందరూ మా ఇంటి పైభాగంలో తలదాచుకున్నారు. ఆ క్షణాలు ఇప్పుడు తలుచుకున్నా వణుకు పుడుతుంది. సహాయం కోసం పోలీసులకు, మా హిందూ స్నేహితులకు ఫోన్ చేశాం. ఎవరూ స్పందించలేదు. అర్ధరాత్రి దాటిన తరువాత నేను నా షాపుకి వెళ్లాను. షాపులో సామానంతా రోడ్డుపై పడేశారు. పిల్లల పెళ్లికని దాచుకున్న రూ.4 లక్షల సొమ్మును కూడా దోచుకెళ్లారు' అని హసన్ బాధగా చెప్పాడు.

**రక్షించలేమని చెప్పారు:** ర్యాలీ జరిగిన మరుసటి రోజు హిందూ గ్రూపులకు చెందిన కార్యకర్తలు వేలాదిగా నందనగర్ వచ్చారు. 60, 70 మంది పోలీసులు గస్తీ నిర్వహించారు. అయితే ఈ పోలీసులు ముస్లిం వ్యక్తులకు రక్షణ కల్పించలేమని చేతులెత్తేసారు. 'మీ ప్రాణాలను మీరే రక్షించుకోండి. వీలైనంత దూరం పారిపోండి సహాయం చేస్తాం' అన్నారని హసన్ గుర్తుచేసుకున్నాడు.

గ్రూపు సభ్యుడు చేసిన హింసాత్మక, మతోన్మాద ఉపన్యాసం తరువాత ఆ వ్యక్తులు చేసిన బీభత్సానికి ముస్లిం వ్యక్తులు ఊకుమ్మడిగా ఊరు వదిలి వెళ్లిపోయారు. అర్ధరాత్రి దాటిన తరువాత పోలీసులు దగ్గరుండి మరీ జీపుల్లో వారిని నగరం వెలుపల విడిచిపెట్టారు.

ఆ రోజుతో నందనగర్‌లో వాళ్ల జీవితాలు తెల్లారినట్లే అని ఆ ముస్లిం కుటుంబాలు భావించాయి. కానీ హసన్ అలా ఊరుకోలేకపోయాడు. అప్పుడు అతని మానసిక పరిస్థితి ఎలా ఉందో ఇలా చెప్పాడు. 'నా గుర్తింపు ఇక్కడే ఉంది. ఇదే నా నివాసం.

ఉన్నట్లుండి ఈ ప్రాంతం, ఈ ఇల్లు నాది కావంటే నేను ఎక్కడికి వెళ్లాలి? నా కుటుంబం ఏమై పోవాలి? అని బాగా ఆలోచించాను. కొన్ని రోజుల తరువాత రక్షణ కల్పించమని అయ్యూమ్ అనే వ్యక్తితో కలిసి కోర్టులో పిటిషన్ వేశా. తీర్పు మాకు అనుకూలంగా వచ్చింది. కానీ..' అంటూ హసన్ బాధగా నిట్టూర్పు విడిచాడు.

**నేను భూతంలా కనిపిస్తున్నాను:** తీర్పు తరువాత హసన్ ఒక్కడే నందనగర్ చేరుకున్నాడు. భయంతో మిగిలిన వారు ఎవ్వరూ రాలేదు. భార్య నలుగురు పిల్లలతో ఇంటికి వెళ్లినహసన్ ఇప్పుడు రోజూ బాధపడు తున్నాడు. అతని షాపుకి ఎవ్వరూ రావడం లేదు. అసలు ఎవ్వరూ అతనితో మాట్లాడడం లేదు. ఈ పరిస్థితి గురించి చెబుతూ.. 'నేను ఇప్పుడు ఇక్కడ అందరికీ భూతంలా కనిపిస్తున్నాను. నా కుటుంబంతో కలసి ఇంతకుముందులా స్వేచ్ఛగా బయటికి వెళ్లలేకపోతున్నా. మా అమ్మాయిని తన పక్కన కూర్చోవద్దని స్నేహితు లు అంటున్నారు. స్కూలుకు వెళ్లడానికి ఆ పిల్ల ఇష్టపడడం లేదు. ఈ పరిస్థితులు ఎంత దూరంతీసుకెళతాయో అర్థం కావడం లేదు' అని వాపోతున్నాడు. హసన్ పడుతున్న ఈ బాధ ఎందరో ముస్లింలది!

# ఉపాధి హామీ చట్టానికి తూట్లు..?




గ్రామాల్లో పేదలకు ఏడాదిలో కనీసం వంద రోజులు పని కల్పించే ఉద్దేశంతో యుపిఎ-1 హయాంలో తీసుకొచ్చింది. మహాత్మా గాంధీ గ్రామీణ జాతీయ ఉపాధి హామీ చట్టం (ఎం.ఎన్.ఆర్.ఇ.జి.ఎ-నరెగా). అటువంటి బృహత్తర చట్టం అమలులో లెక్కకు మించిన లోపాలను ఎత్తిచూపింది పార్లమెంటరీ స్థాయి సంఘం. చట్టం హామీ ఇచ్చిన ప్రయోజనాలు కార్మికులకు దక్కడం లేదని గుర్తించింది. నరెగాపై సమగ్ర సమీక్ష కోసం జాతీయ స్థాయిలో స్వతంత్రతతో కూడిన పారదర్శక సర్వే నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేసింది. కార్మికుల సంతృప్తి, వేతనాల్లో జాప్యం, భాగస్వామ్యం పోకడలు, ఆర్థిక అవకతవకల దృష్టి కోణంలో సర్వే చేయాలని సూచించింది. చట్టం అమల్లో ఎదురవుతున్న సవాళ్లనూ పరిశీలించాలంది. కార్మికుల పనిదినాలు వంద నుంచి 150 రోజులకు, దినసరి వేతనం 400 రూపాయలకు పెంచాలని తెలిపింది. కాంగ్రెస్ ఎంపి సప్తగిరి శంకర్ ఉల్కా నేతృత్వంలో గ్రామీణాభివృద్ధిపై పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ మోడీ పదేళ్ల జమానాలో ఉపాధి హామీపై మచ్చుకు పరిశీలించి ఇచ్చిన రిపోర్టు ఇది. నరెగాను మోడీ ప్రభుత్వం ఒక క్రమ పద్ధతిలో నిర్వీర్యం చేస్తోందని నివేదికతో స్పష్టమైంది. ఆది నుంచీ నరెగాపై మోడీ ప్రభుత్వానిది మొసలి కన్నీరేనని దాని చేష్టలే తెలుపుతాయి. బడ్జెట్ కేటాయింపుల నుంచి అమలు వరకు ప్రతిదీ చట్టాన్ని దెబ్బతీసేదిగానే ఉన్నాయి. బడ్జెట్ ప్రతిపాదనలనే తీసుకుంటే దశాబ్ద కాలంలో ఏనాడూ డిమాండ్‌కనుగుణంగా లేవు. ఏవో కొన్ని నిధులను చూపించడం, వాటితోనే కాలక్షేపం చేయడం, చివరాఖరులో ఎంతో కొంత విదిలించడం పరిపాటిగా మారింది. కరోనా సమయంలో మాత్రమే ఖర్చు రూ.లక్ష కోట్లు దాటింది. పట్టణాలకు వలసలు వెళ్లిన లక్షలాది కార్మికులు తమ ఊళ్లకు వెనక్కి వచ్చిన సందర్భంలోని ఆ ఖర్చు సైతం నాటి డిమాండ్‌తో పోల్చితే చాలా చాలా తక్కువ. అదేంటంటే, బడ్జెట్‌లో నిధులు చూపించాల్సిన అవసరం లేదని, డిమాండ్ పెరిగితే ఆటోమేటిగ్గా నిధులు పెంచుతామన్న మోడీ సర్కారు మాట ఒట్టి బూటకం. సకాలంలో నిధులివ్వని కారణంగా పనులు నిలిచిపోయిన ఉదంతాలెన్నో. రాష్ట్రాలకు నిధుల విడుదలలో కేంద్రం తీవ్ర జాప్యం చేస్తోందని పార్లమెంట్ సాక్షిగా నిరూపణ అయింది. 2025 మార్చి చివరినాటికి కేంద్రం రాష్ట్రాలకు అక్షరాలా 26 వేల కోట్ల రూపాయలు బకాయి పడింది. వాటిలో కూలీల వేతనాలు రూ.15 వేల కోట్లు. 2024-25లో ఉపాధి హామీకి ప్రతిపాదించింది రూ.86 వేల కోట్లు కాగా అంత పెద్ద మొత్తంలో నెలల పర్యంతం నిధులివ్వకుండా జాప్యం చేసి పేదలను ఉద్ధరిస్తామనడం వంచన కాదా? ఉపాధి హామీ ప్రధాన లక్ష్యం గ్రామీణ పేదలకు ఉపాధి కల్పన. ఆ లక్ష్యాన్ని మోడీ సర్కారు క్రమంగా పక్కదారి పట్టించే ఎన్నో చర్యలు చేపట్టింది. బిజెపి, ఎన్‌డిఎ పాలిత రాష్ట్రాలు వాటిని పుణికిపుచ్చుకుంటున్నాయి. వ్యవసాయానికి అనుసంధానం పాట పాడుతున్నాయి. ఖర్చు లేని ప్రకృతి వ్యవసాయానికి, సేంద్రీయ వ్యవసాయానికి లింక్ పెడుతున్నాయి. నరెగా పనుల్లో భారీ యంత్రాల వినియోగం చట్ట విరుద్ధం. అపరిమితమైన మెటీరియల్ కాంపొనెంట్ సైతం చట్ట విరుద్ధం. అవన్నీ యధేచ్ఛగా సాగిపోతున్నాయి. పని లేని రోజుల్లో పని కల్పన కోసం గ్రామాల్లో జాబ్ కార్డుల జారీ సక్రమంగా లేదు. జాబ్ కార్డు పొందిన ప్రతి ఒక్కరికీ పని కల్పించాలన్న నిబంధన అమలు కావట్లేదు. వేతనాల జాప్యానికి పరిహారం విషయంలోనూ తప్పించుకొనే ఉదంతాలే ఎక్కువ. ఇటీవలి కాలంలో లక్షలాది జాబ్‌కార్డులు రద్దు చేస్తున్నారు. ఆర్థిక అవకతవకలు సరేసరి. ఈ చర్యలన్నీ ఉపాధి హామీ లక్ష్యాన్ని పలచన చేసేవి. ఉపాధి లేని కార్మికులకు అన్యాయం చేసేవి. కార్మికుల్లో వందకు వంద రోజులూ పని దొరికే వారిని, దినసరి వేతనం రూ.300 దొరికే వారిని వేళ్లపై లెక్కించొచ్చు. పట్టణాల్లో, గ్రామాల్లో భారీ యంత్రాల విచ్చలవిడి వినియోగం, ఆర్థిక మాంద్యం, వ్యవసాయ సంక్షోభం వలన పనుల కోసం డిమాండ్ పెరుగుతోంది. కరువొస్తే తీవ్రత ఇంకా ఎక్కువ. అందుకే ఏడాదిలో 200 రోజుల పని, దినసరి కూలి 600 కావాలన్న డిమాండ్ బలంగా ముందుకొస్తోంది. అర్బన్‌లోనూ ఉపాధి హామీ కావాలన్న ఆకాంక్ష వెల్లడవుతోంది.



## హెడ్లీ ఎక్కడ..?

2008 ముంబై ఉగ్రవాద దాడులలో కీలక కుట్రదారుడు తహవ్వుర్ రాణాను అమెరికా ప్రభుత్వం భారతదేశానికి అప్పగించిన నేపథ్యంలో.. మరొక ప్రధాన కుట్రదారుడు డేవిడ్ హెడ్లీని ఎప్పుడు తీసుకువస్తారనే చర్చ ఇప్పుడు దేశవ్యాప్తంగా జరుగుతోంది. అయితే అతడిని భారతదేశానికి తీసుకురావడం దాదాపు అసాధ్యంగా కనిపిస్తోంది. ముంబై దాడులకు ముందు.. ఆ కుట్రలో కీలక పాత్ర పోషించిన డేవిడ్ కోల్మన్ హెడ్లీ ముంబైలో రిక్కీ నిర్వహించాడు. అతడికి అన్ని విధాలా రాణా సహాయం చేశాడు. ఇప్పుడు రాణాను అమెరికా ప్రభుత్వం భారతదేశానికి అప్పగించేంది. కానీ హెడ్లీని అప్పగించడానికి అమెరికా సిద్ధంగా లేదని తెలుస్తోంది. దీనికి చట్టపరమైన, దౌత్య, వ్యూహాత్మక కారణాలు ఉన్నాయని గూఢచారి వర్గాలు వెల్లడించాయి. 2010లోనే హెడ్లీ తనను భారత్, పాకిస్తాన్, డెన్మార్క్ దేశాలకు అప్పగించకూడదని అమెరికా అధికారులతో ఒప్పందం చేసుకున్నట్లు తెలియజేశారు. ఇది చట్టబద్ధమైన ఒప్పందమని.. రాణా వంటి కుట్రదారులకు వ్యతిరేకంగా సాక్ష్యం ఇచ్చినందుకు బదులుగా అతనికి మరణశిక్ష నుంచి తప్పించుకున్నాడని ఆ వర్గాలు వివరించాయి.

## వెంకటేశ్‌తో త్రివిక్రమ్ సినిమా..?





వెంకటేశ్- త్రివిక్రమ్.. ఈ కాంబినేషన్ సినిమా కోసం ఆశించని ప్రేక్షకుడు లేడు. వెంకటేశ్ నటించిన నువ్వు నాకు నచ్చావ్, మల్లీశ్వరి చిత్రాలకు త్రివిక్రమ్ మాటలు రాశారు. దర్శకుడయ్యాక ఆయన వెంకీతో సినిమా చేస్తారని అందరూ భావించారు. కానీ ఎందుకో ఆ కాంబినేషన్ సెట్ కాలేదు. అయితే.. ఎట్టకేలకు వెంకీ, త్రివిక్రమ్ లకాంబినేషన్ సెట్ అయ్యిందని విశ్వసనీయ సమాచారం. వాస్తవానికి బన్నీ హీరోగా త్రివిక్రమ్ ఓ సినిమా చేయాలి. అయితే.. అట్లీప్రాజెక్ట్‌ని ముందు ఓకే చేశారు బన్నీ. ఆప్రాజెక్ట్ పూర్తయ్యే సరికి దాదాపు ఏడాదిన్నర పట్టడం ఖాయం. ఈ లోపు బన్నీ స్క్రిప్ట్ పూర్తి చేస్తూ, మరోవైపు వెంకీతో సినిమా కానిచ్చేయాలని త్రివిక్రమ్ నిర్ణయించారట. వెంకటేశ్‌కి సరిగ్గా సరిపోయే ఫ్యామిలీ డ్రామా సబ్జెక్ట్ త్రివిక్రమ్ దగ్గర సిద్ధంగా ఉందట. త్వరలో షూటింగ్ మొదలు పెట్టి, త్వరగా పూర్తి చేయాలనే సంకల్పంతో త్రివిక్రమ్ ఉన్నారట. ఆ వెంటనే బన్నీ సినిమా మొదలుపెడతారన్నమాట.

## రకుల్ అందుకే అలా చేస్తుందా..?



ఒకప్పుడు తెలుగులో టాలీవుడ్ టాప్ హీరోయిన్‌గా ఓ వెలుగు వెలిగిన అందాల ముద్దుగుమ్మ రకుల్ ప్రీత్ సింగ్ గురించి ప్రత్యేక పరిచయాలు అక్కర్లేదు. దాదాపు టాలీవుడ్ టాప్‌హీరోలందరితో నటించి అలరించింది. మహేష్ బాబు, ఎన్టీఆర్ , అల్లు అర్జున్, రామ్ చరణ్ వంటి స్టార్ హీరోల సరసన నటించి మంచి గుర్తింపు తెచ్చుకున్న ఈ భామ వరుస ఫ్లాపులతో డీలా పడింది. టాలీవుడ్‌లో అవకాశాలు తగ్గడంతో కోలీవుడ్, బాలీవుడ్‌లోకి వెళ్లి అక్కడ తన అదృష్టం పరీక్షించుకునే ప్రయత్నంచేసింది. కాని అక్కడ ఆమెకి సరైన సక్సెస్ రాలేదు. ఇక అవకాశాల కోసం ఫొటో షూట్లు, జిమ్ వీడియోలతో గ్లామర్‌గా కనిపించినా కూడా రకుల్‌ని పట్టించుకునే వారే కరువయ్యారు. రకుల్ సినిమాల్లో కనిపించి దాదాపు రెండేళ్లు కావొస్తోందంటే ఆమె పరిస్థితి ఏ రకంగా ఉందో మనకి అర్థం అవుతుంది. ఇక సినిమా అవకాశాలు తగ్గడంతో ఈభామ తను ప్రేమించిన జాకీ భగ్నానీని వివాహం చేసుకు ంది. వారి వివాహం గత ఏడాది ఫిబ్రవరి 21న జరిగింది. అంగరంగ వైభవంగా జరిగిన వివాహ వేడుకతో రకుల్, జాకీ ఒక్కటి కాగా, వారి వివాహం పంజాబీ సాంప్రదాయ పద్ధతిలో జరగ్గా.. ఆ తర్వాత వరుడి సాంప్రదాయం ప్రకారం సింధి పద్ధతిలో అట్టహాసంగా జరిగింది.

## ట్రెండింగ్‌లో సోదరా...



రెండేండ్ల గ్యాప్ తర్వాత మరోసారి సంపూర్ణేశ్ బాబు ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. ఆయన నటించిన సోదరా సినిమా ఈ నెల 25వ తేదీన విడుదల కాబోతున్నది. అన్నదమ్ముల ఎమోషన్స్ చుట్టూ తిరిగే ఈ సినిమాలో సంపూర్ణేశ్ బాబు తమ్ముడిగా సంజోశ్ నటించాడు. మన్మోహన్ మేనంపల్లి దర్శకత్వంలో వస్తున్న ఈ సినిమాకు సంబంధించిన ట్రైలర్ తాజాగా విడుదలైంది.


నాలుగు రోజుల క్రితం విడుదలైన ఈ సినిమా ట్రైలర్ యూట్యూబ్‌లో దూసుకెళ్తోంది. నాలుగు రోజుల్లోని మిలియన్‌కు పైగా వ్యూస్‌ను సొంతం చేసుకుంది. ఈ విషయాన్ని ఆదిత్య మ్యూజిక్ ట్విట్టర్ ద్వారా వెల్లడించింది. చిన్నతనం నుంచి ఎంతో ప్రేమగా పెరిగిన ఇద్దరు అన్నదమ్ములు వారి పెళ్లి కోసం పడే కష్టాలే ఈ సినిమాగా తెరకెక్కినట్లుగా ట్రైలర్ చూస్తే అర్థమవుతోంది. విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో వస్తున్న ఈ సినిమాలో అటు ఫ్యామిలీ ఎమోషన్స్‌తో పాటు, యాక్షన్ రెండు సమపాళ్లలో ఉన్నట్లుగా తెలుస్తోంది.

ట్రైలర్ చూసిన ప్రతి ఒక్కరూ సంపూర్ణేశ్‌బాబుకు ఆల్‌ది బెస్ట్ చెబుతున్నారు. ట్రైలర్ బాగుందని..

సినిమా కూడా సూపర్ హిట్ కావాలని ఆకాంక్షిస్తూ కామెంట్లు పెడుతున్నారు. కాగా, ఈ సినిమాలో ఆర్తి, ప్రాచి బన్సాల్ హీరోయిన్లుగా నటించారు. క్యాన్ ఎంటర్‌టైన్‌మెం ట్స్ బ్యానర్‌పై చంద్ర చగంలా ఈ సినిమాను నిర్మించారు.


## హీరో హీరోయిన్ మధ్య పారితోషికాల్లో ఎందుకంత వ్యత్యాసం..?

‘ఏమాయ చేశావే’ చిత్రంతో ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చి మొదటి సినిమాతోనే ప్రేక్షకులను మాయ చేసింది సమంత. ఆ తర్వాత వరుస సినిమాలతో అనతికాలంలోనే అగ్ర కథానాయికగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. తెలుగు, తమిళం భాషల్లో వరుసగా సినిమాలు చేస్తూ బిజీ బిజీగా మారిపోయింది. అయితే, నాగచైతన్యతో విడాకులు, మయోసైటిస్ కారణంగా కాస్త సినిమాలకు బ్రేక్ ఇచ్చిన సామ్.. ఇప్పుడిప్పుడే మళ్లీ ఫామ్‌లోకి వచ్చింది. వరుస ప్రాజెక్టులతో బిజీగా మారిపోయింది. టాలీవుడ్‌లో సమంత సినిమా వచ్చి రెండేళ్లవుతోంది. చివరిసారిగా విజయ్ దేవరకొండతో కలిసి ‘ఖుషి’ చిత్రంతో పలకరించిన ఈ బ్యూటీ ప్రస్తుతం ‘మా ఇంటి బంగారం’ అనే మూవీ చేస్తోంది. అలాగే నెట్‌ఫ్లిక్స్‌లో ‘రక్త్ బ్రహ్మండ్’ అనే ప్రాజెక్ట్‌లోనూ భాగమైంది. ఇవి కాకుండా ‘శుభం’ అనే సినిమా నిర్మిస్తోంది. తాజాగా ఓ పాడ్‌కాస్ట్‌కు హాజరైన సామ్.. హీరో హీరోయిన్ల మధ్య పారితోషికం వ్యత్యాసంపై పెదవి విప్పింది. ఈ విషయంలో హీరోయిన్స్ ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటున్నట్లు చెప్పింది. హీరోలు, హీరోయిన్లు ఒకేలా కష్టపడుతున్నప్పటికీ పారితోషికాల్లో మాత్రం ఎందుకు ఇంత వ్యత్యాసం..? అని ప్రశ్నించింది. ‘నేను చాలా సినిమాల్లో నటించాను. హీరోలతో సమానంగా వర్క్ చేశాను. కానీ, మాకిచ్చే రెమ్యునరేషన్ మాత్రం ఒకేలా ఉండేది కాదు. కొన్ని పెద్ద సినిమాల్లో హీరో పాత్ర కీలకంగా ఉంటుంది. పైగా తనే జనాల్ని థియేటర్‌కు రప్పించగలడు. అలాంటి వాటిని నేను అర్థం చేసుకోగలను. అలాంటి సినిమాల్లో ఇద్దరి మధ్య బేధం చూపించినా నేను తప్పుపట్టను. కానీ, కొన్ని చిత్రాల్లో హీరో హీరోయిన్‌కు ఇద్దరికీ



సమాన ప్రాధాన్యత ఉంటుంది. పారితోషికం దగ్గర మాత్రం వ్యత్యా సం చూపిస్తారు. అలా ఎందుకు చేస్తారో నాకు అర్థం కావట్లేదు. నేను ఇండస్ట్రీలో 15 సంవత్సరాలుగా ఉన్నాను. పరిశ్రమలో నన్ను ఇబ్బందిపెట్టే విషయాల్లో ఇదీ ఒకటి. అందుకే ఇన్నేళ్లలో నేను చేసిన తప్పుల్ని పునరావృతం కాకుండా చూసుకుంటాను. ఈ విషయంలో మార్పు తీసుకురావాలని ప్రయత్నిస్తున్నా. సడన్‌గా అన్నీ మార్చలేనేమో కానీ భవిష్యత్తు గురించి మాత్రం ఏదో ఒకటి చేయగలను. మార్పు నాతోనే మొదలవ్వాలని అనుకు ంటున్నా. అందుకే నా సంస్థలో ఇలాంటి వ్యత్యాసం రాకుండా చూసుకుంటున్నాను’ అని సమంత చెప్పుకొచ్చింది.

## ప్రభాస్‌కు విలన్‌గా మమ్ముట్టి





ప్రభాస్‌తో సందీప్‌రెడ్డి వంగా తెరకెక్కించనున్న ‘స్పిరిట్’ సినిమా మెయిన్ కథాంశమే చాలా కొత్తగా ఉంటుందట. ఇప్పటివరకూ ఇండియన్ స్క్రీన్‌పై ఈ తరహా కథ రాలేదని దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా స్వయంగా ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. ‘కాప్ స్టోరీలు ఇప్పటివ రకూ ఇండియన్ స్క్రీన్‌పై కొన్ని వందలు వచ్చుంటాయి. కానీ.. ఈ తరహా కాప్‌ని మాత్రం ఇండియన్ ఆడియన్ కచ్చితంగా చూసుండడు. ఇది ఒక కథకునిగా చెబుతున్న మాట.’ అని సందీప్‌రెడ్డి వంగా తెలి పారు. ఈ సినిమా ప్రీప్రొడక్షన్ పనుల్ని శరవేగంగా పూర్తి చేస్తున్నారు సందీప్‌రెడ్డి వంగా. ఓ వైపు ఇప్పటికే హర్షవర్దన్ రామేశ్వర్‌తో మ్యూజిక్ సిట్టింగ్స్ కూడా పూర్తి చేశారు. స్క్రిప్ట్ వర్క్ ఇప్పటికే పూర్తయింది. ప్రస్తుతం నటీనటుల వేటలో ఉన్నారు సందీప్‌రెడి. ఇందులో కొరియన్, అమెరికన్ యాక్టర్స్ కూడా నటించను న్నట్టు తెలుస్తున్నది. మరో ముఖ్యమైన విషయం ఏంటంటే.. మలయాళ సూపర్‌స్టార్ మమ్ముట్టి ఈ సినిమాలో కీలక పాత్ర పోషిస్తున్నారట. ఆయన పాత్ర నెక్స్ లెవల్లో ఉంటుందని సమాచారం. ఈ ఏడాది ద్వితీయార్ధంలో షూటింగ్ మొదలు కానుంది. టి-సిరీస్, భద్రకాళి పిక్చర్స్ కలిసి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్న విషయం తెలిసిందే.

Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana.
Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. rni. no: TELTEL/2023/88215